# సమర్థ సద్గురు

మార్చి 2026

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00



## 2026 జనవరి 6, 7 తేదీలలో శ్రీ కాళీప్రసాద ఆశ్రిత ఆశ్రయం, నందికొట్కూరు చతుర్ధ వార్షికోత్సవ దృశ్యములు










# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 7
పేజీలు 44
మార్చి 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................... ....... పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ......................................... 5
అమ్మమాట......................................... .................. 8
పరాభవ ........ ...... ............ ................. ............................9
సద్గురు సమర్థత-నిరూపణ.........................11
నాదోపాసన ..........................................................12
భగవద్గీత సాధన దీపిక ...............................14
స్వామి దయానంద మహరాజ్... ..................16
సమర్థసద్గురు యాజమాన్యం వివరాలు...18
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ......... 19
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 21
నారద భక్తి సూత్రములు ................ ..............23
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....25
పూర్వజన్మ.- పునర్జన్మ.......................................26
శ్రీ బాబూజీతో నా ప్రయాణం .................28
సవ్య అపసవ్య మార్గములు.....................29
నిరీక్షణ ..................................................................31
శ్రీ గురుగీత .......................................... ........32
సృష్టిక్రమం ..........................................................33
గురుకృప .......................................... .............35
శ్రీబాబూజీతో అనుభవాలు ................. 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



10. *శిల్పి జూచు శిల్ప చాతుర్యంబు*
*పండితుండు జూచు పనితనంబు*
*రాయిలోన దేవుజూడ భక్తుడే సరి*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవటానికి ఒక శిల్పి, ఒక ఆగమశాస్త్ర పండితుడు, ఒక స్వర్ణకారుడు, ఒక భక్తుడు వెళ్ళారనుకోండి. తీరా అక్కడకు వెళ్ళాక శిల్పి దృష్టి అంతా ఆ స్వామి విగ్రహాన్ని ఏ శిలతో మలిచారు, అక్కడ ఇంకా ఎటువంటి శిల్పాలున్నాయి, వాటిని చెక్కినవారి ప్రతిభ ఎలాంటిది అనే అంశాల చుట్టూ తిరుగుతుంది. అలాగే ఆగమశాస్త్ర పండితుడు ఆ ఆలయం శాస్త్రంలోని ఏయే సూత్రాలను అనుసరించి కట్టారో పరిశీలిస్తూ ఉంటాడు. స్వర్ణకారుడు స్వామి ధరించిన నగల గురించే పట్టించుకుంటాడు. అదే భక్తుడు మాత్రం ఆ విగ్రహంలో సాక్షాత్తు పరంధాముని దర్శించి ఆ దివ్యమంగళ మూర్తి దర్శనంలో తనువు పులకించి భక్తిపారవశ్యంలో మునిగిపోతాడు. శిలలో పరమాత్ముని దర్శించాలంటే తగిన సాధనం భక్తి ఒక్కటే.

1) ఆహారం ఎందుకు పారిపోయింది?
2) సర్వ ధర్మములను వదిలి, గురుదేవుని (భగవంతుని) ఎందుకు శరణు పొందాలి?
3) ఇత్తడి గంగాళంలో తోడు పెట్టినా పెరుగు పాడవకుండా ఎలా వుంది?
4) ప్రతిరోజూ సముద్రస్నానం ఎందుకు చెయ్యకూడదు?
5) అకస్మాత్తుగా బొంబాయి వెళ్ళిన భక్తుడు ఏమి చేశాడు?
6) భక్తిలో ఉన్న మూడు విధములు ఏవి?
7) దొంగలకు రామ దర్శనం ఎలా అయ్యింది?
8) సంకల్పానికి బీజరూపం ఏమిటి?
9) కృష్ణుడు దేవకి పెట్టిన వెన్న ఎందుకు తినలేదు?
10) కృష్ణ విగ్రహం ఎందుకు నల్లబడింది?

*సమాధానాలు లోపలి పేజీలలో............................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

28-10-1981

ఈరోజు రాత్రి ప్రార్థన అయిన తర్వాత శ్రీ బాబూజీ దర్శనార్థం వేచివుండి విజయవాడ సత్సంగంలో ఉపన్యాసము మననము చేసుకుంటున్నాము. ఇంతలో శ్రీ బాబూజీ వచ్చారు. 'మీరంతా ఏదో చర్చిస్తున్నట్టున్నారు? ఉపన్యాసము ఎవరు వ్రాశారు?' అని అడిగారు శ్రీ బాబూజీ. 'నేను వ్రాశాను' అని వెంకటేశ్వర్లుగారు చెప్పారు.'అరె నువ్వు వ్రాశావా! ఫర్వాలేదే భగవంతుని సేవకి టైము ఇస్తున్నావన్నమాట' అన్నారు శ్రీ బాబు.



వెంటనే వెంకటేశ్వర్లుగారు కల్పించుకొని 'నేను ఉపన్యాసాలు వ్రాయటం లేదని ఎడిటర్‌గారు మీకు చెప్పారట. నేను ఉపన్యాసాలు మీమీద భక్తికొలదీ వ్రాస్తున్నాను బాబు' అన్నారు. శ్రీ బాబు మాట్లాడుతూ, 'నామీద అంత భక్తి ఉంటే ఇంతవరకు ఎన్ని ఉపన్యాసాలు వ్రాశావో చెప్పు? ఎందుకయ్యా మాట్లాడతావు. నన్ను నువ్వు అంతవరకే అర్థం చేసుకున్నావన్నమాట. నీ గురించి నాకు ఒకరు చెప్పవలసిన పని ఏముంది? ఎవరైనా చెపితేగాని నాకు తెలియదన్నమాట? ఇటువంటి భావాలు కలవారు ఏం సాధన చేస్తారయ్యా?' అన్నారు శ్రీ బాబు. వెంకటేశ్వర్లుగారు ఇంకా ఏదో మాట్లాడటానికి ప్రయత్నించగా, శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'క్రియలో చూపించవయ్యా నీ ప్రతాపం' అన్నారు.

ఇంతలో శ్రీ బాబూజీ దర్శనార్థం ఆంధ్రప్రభ ఎడిటర్ సుబ్రహ్మణ్యం గారు, ఆయన మిత్రులూ వచ్చారు. ఎడిటర్‌గారి మిత్రులు శ్రీబాబుకి నమస్కరించి కూర్చున్నారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'అప్పుడే మీరు ఆలోచిస్తున్నారు. ఎడిటర్‌గారు స్వామిని గురించి చెప్పారు కదా! ఈయన ఇలా ఉన్నారేమిటి? అని అనుకుంటున్నారు కదూ? మీరు నా దగ్గరకు వచ్చిన కారణం తెలుసు. భగవంతుని ఎలా తెలుసుకోవటం? అనే కోర్కెతో వచ్చారు. భక్తుడు మొదట సగుణారాధన చేస్తాడు. తన గృహంలో పూజా మందిరంలో తనకు ఎదురుగా ఇష్టదైవము యొక్క ఫొటో పెట్టుకొని స్వహస్తములతో పూజ చేస్తాడు. హారతి ఇస్తాడు. ఆ మూర్తిని చూస్తూ తన్మయత్వంలో ఉంటాడు. ఇలా కొంతకాలం జరుగుతుంది.

తర్వాత అకస్మాత్తుగా బొంబాయి వెళ్ళవలసి వస్తుంది. బొంబాయిలో హోటల్ తాజ్‌లో ఉంటాడు. కాని అతని దృష్టి కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉన్న పూజా మందిరంలోని స్వామి మీదనే ఉంటుంది. ఆ వియోగాన్ని భరించలేడు. పూజా

మందిరంలో ఉన్న స్వామి మూర్తిని హృదయమందిరంలో నిలుపుకుంటాడు. హృదయ మందిరంలో నిలుపుకున్న స్వామి మీదనే మనస్సు లగ్నమయి ఉంటుంది. సగుణారాధన నుంచి నిర్గుణారాధనలోనికి మారుతుంది. ఇప్పుడు ఇంక హృదయ మందిరంలో వున్న స్వామికి మనోపుష్పాలను సమర్పిస్తాడు. ఆ స్వామిని చూసన్తూ తన్మయుడై ఆనందబాష్పాలతో అభిషేకం చేస్తాడు. అహంకారమనే టెంకాయ కొడతాడు. ఇక సంకల్పములన్నిటినీ జయిస్తాడు.

అన్నింటిలోనూ అహంకార మమకారాలను జయించటం అంత తేలిక కాదు. అవి రెండు మాటలుగా కన్పడుతాయి. కాని ఆ రెండింటిని జయిస్తే ఇంక 10 అంటే దశేంద్రియాలను జయించినట్లన్నమాట. మనస్సుని జయిస్తే చాలు మిగిలినవన్నీ ఆటోమాటిక్‌గా జయించినట్లే, హృదయ మందిరంలో నిలుపుకున్న స్వామిలో మనస్సు ఇంద్రియాలు క్రమేపీ లయమై తదాకారాన్ని పొందుతాడు. ఆ స్థితిలో సర్వేసర్వత్రా స్వామినే దర్శిస్తాడు.

ఇక్కడ మీకు ఒక సంఘటన చెప్తాను. నేను చిన్నప్పుడు పలకమీద అక్షరాలు వ్రాద్దామంటే జగజ్జనని కన్పడేది. ఇంక నేను పలకమీద ఏం వ్రాయను? ఇంతకన్న విచిత్రమైన సంఘటన ఇంకొకటి ఉంది. ఉదయమే కాలకృత్యాలు తీర్చుకొందామని మనుష్య సంచారములేని దూరప్రదేశానికి వెళ్ళేవాడిని. చుట్టూ చెట్లు చూసుకొని కూర్చునేసరికి సర్వే సర్వత్రా అమ్మనే దర్శించేవాడిని. మరి ఇంక నా కార్యక్రమం ఎలా పూర్తి చేయటం? అలాగే ఎన్నో గంటలు కూర్చుని తిరిగి ఇంటికి వచ్చేసేవాడిని. ఇంటికి వచ్చి నాన్నగారితో ఈ విషయం చెప్పగానే ఆనందబాష్పాలు కార్చేవారు. కన్ను ముక్కు ఏకం అయ్యేవి. అలా పరమాత్ముని సర్వే సర్వత్రా దర్శించిన మహాత్ములు అనేకమంది ఉన్నారు. అలా దర్శించిన తర్వాత నేను వేరు, నా స్వామి వేరు అన్న భావన కూడ తుడిచివేస్తాడు. ఆ చిన్న సంకల్పము కూడ మిగులకూడదు. ఒక గ్లాసులో నీరు వుందనుకోండి. ఇంకొక గ్లాసులో పటికబెల్లం వుందనుకోండి. ఆ పటికబెల్లం అంతా నీళ్ళ గ్లాసులో వేస్తే కరిగిపోతుంది. ఒక చిన్న పలుకు మిగలకుండా కరిగిపోవాలి. అప్పుడు తానే ఆ పరమాత్మ వస్తువునని గుర్తిస్తాడు. తనలోను, అంతటా ప్రకాశించేది ఒకే ఆత్మవస్తువని తెలుసుకుంటాడు. అది నిత్యమైనది, సత్యమైనది, శాశ్వతమైనది. అది పరిణామము చెందనిది. దానికి వృద్ధి క్షయములు లేవు. అందరిలోనూ పుట్టినది మొదలు అంత్యకాలం వరకూ పరిణామము చెందనిది ఒకటి ఉంది. అదే సోఽహం. అది తొలగిపోతే శరీరము జడమే. శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ, చూడండి వుదాహరణకి పితాజీ (ఎడిటర్ సుబ్రహ్మణ్యంగారు) తలమీద వెంట్రుకలు తెల్లగా స్వచ్ఛంగా ఉన్నాయి. అది వాటి సహజగుణం. అది మార్పు చెందదు' అన్నారు. ఎడిటరుగారి మిత్రులను చూపించి, 'వీరి తలమీద చూడండి వెంట్రుకలు నల్లగా

వున్నాయి. ఇవి బ్లాక్ కోటింగ్ వలన నల్లగా వున్నాయి. ఈ బ్లాక్ కోటింగ్ వెనుక తెల్లని వస్తువు దాగి ఉంది అంటే నమ్ముతారా? కాబట్టి ఇంద్రియాలు దేహం మార్పు చెందేవే. బాల్యంలో, యౌవనంలో ఉన్న పుష్టి వార్ధక్యంలో ఉండమంటే ఉంటుందా!

చూడండి మీరంతా చిన్నతనంలో తేలికగా ఒక డజను ఇడ్లీ తినగలిగేవారు. కాని ఇప్పుడు తినమంటే తినగలరా? అంత ఎందుకూ చిన్నతనంలో ఈ భక్తుడు మూడు పెసరట్లు ఇంకా దేనితోనో కలిపి సునాయాసంగా తినేసేవాడు. ఇప్పుడు తింటే ఏమవుతుంది? మూడుసార్లు వెళ్ళవలసివస్తుంది" అన్నారు. శ్రీ బాబు తిరిగి మాట్లాడుతూ "పరిణామము చెందనిది ఆత్మవస్తువు. అది అందరిని ప్రకాశింపజేస్తూ తాను స్వయంగా ప్రకాశించేది. ఇప్పుడు చెప్పండి ఎడిటర్‌గారూ అందరిలోనూ గల ప్రజ్ఞ ఎవరిది?" అని ప్రశ్నించారు. ఉపన్యాసము చెప్పేవాడు, వినేవాడు, వ్రాసేవాడు, వ్రాయించుకునేవాడు, ఆచరించేవాడు ఒకటే అయినపుడు ఇంక మిగిలినది ఏముంది? ఇది అర్థం చేసుకోండి చాలు' అన్నారు శ్రీ బాబు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**మార్చి 2026**

**3 మంగళ: ఫాల్గుణ పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**13 శుక్ర: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**19 గురు: శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**ఏప్రియల్ 2026**

**2 గురు చైత్ర పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**12 ఆది – శ్రీగురుదశమి –ఉ. 11 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## భగవంతుడు సగుణం-ప్రేమ నిర్గుణం

"ప్రపంచంలో ఏది ఎలా వున్నా, 'ప్రేమ' లేని సృష్టి లేదు. భగవంతుడిని పొందడానికి ప్రేమ కావాలి. భగవంతుడు సగుణమయితే, ప్రేమ నిర్గుణం. సకలసృష్టి అంతా కూడా ప్రేమతోనే నిండి వుంది. కానీ ఆ ప్రేమని మానవుడు భగవంతుడి వైపు కాకుండా, అనేకానేక విధాలుగా పంచుతున్నాడు. భగవంతుడిని ప్రేమించడమే 'భక్తి'. '**సా భక్తి పరమ ప్రేమ రూపా**' అని నారద భక్తి సూత్రం. 'సృష్టి అంతా నిండి వున్న ప్రేమే నేను' అంటున్నాడు భగవంతుడు. అయితే అది నిష్కళంకమైన ప్రేమయై వుండాలి. గోపికల ప్రేమ అనన్యమైనది. వారెటువంటి శాస్త్రాలూ చదువలేదు. కాని, తాము భగవంతుడుగా నమ్మిన ఆ శ్రీకృష్ణస్వామి యందు చలించనటువంటి ప్రేమ కలిగి వున్నారు.



తద్వారా వారు ఆ కృష్ణరూపాన్నే పొందారు. ఆనాడు ద్వాపర యుగంలో గోపికలు, ఈనాడు కలియుగంలో మీరాబాయి అట్టి అనన్య భక్తికి తార్కాణం".

మీరా ఒక గొప్ప రాజ్యానికి రాణియై వుండి, ఒక రాజు కూతురై వుండి, వెలలేనట్టి భోగభాగ్యాల మధ్యనే వున్నా, ఆవిడ తన తను, మనో, ధనములను పరిపూర్ణంగా కృష్ణ భగవానునికే అర్పించుకుంది. కనుకనే, ఎందరెందరో రాణుల పేర్లు కాలగర్భంలో కలిసి పోయినా, ఆవిడ పేరు యీనాటికీ 'భక్త మీరా' అని సువర్ణాక్షరములతో విరాజిల్లుతోంది.


ఆ నారాయణమూర్తికి దాసిని అని చెప్పకుంది ఆవిడ. లోకులు తనని పిచ్చిదన్నా, జ్ఞాతులు కులనాశిని అని అన్నా చలించక, చివరికి తన మరిదియైన రాణా, విషపాత్రనే పంపినా, ఆవిడ నవ్వుతూ దానిని కృష్ణనామ స్మరణతో తీసుకునే సరికి, ఆ విషం ఆవిడనేమీ చేయలేకపోయింది. ఆవిడ కొలుస్తున్న కృష్ణ విగ్రహం నల్లబడింది. ఆవిడ అవినాశియైన పరమాత్ముడిని సహజంగానే నమ్ముకుంది కాబట్టి, ఆ విషం ఆమెను నాశనం చేయలేకపోయింది.

"మీ దారాపుత్రాదులని, స్నేహితులని, బంధువులని ప్రేమించిన దానిలో నూరవ వంతు భగవంతుని ప్రేమిస్తే చాలు, మీరు తరిస్తారు" అని శ్రీ బాబూజీ మహరాజ్ ఎప్పుడూ చెప్పేవారు. కనుక అందరూ ఆ భగవంతునియందు అటువంటి చెదరనటు వంటి ప్రేమను పెంపొందించుకుని, నిత్యానందాంబుధిలో ఓలలాడెదరుగాక.

# పరాభవ

- పాలూరి కాళీప్రసాద్

బాబూ! ఒక పంచాంగం ఇవ్వమ్మా! అయ్యో! సరిపోయింది! అసలే నా రాశికి ప్రతి సంవత్సరం రాజయోగం తక్కువ, అవమానం ఎక్కువ అని ఏడుస్తూ ఉంటే ఈసారి ఏకంగా సంవత్సరం పేరే 'పరాభవ'నా? భగవంతుడా! ఇక నా జీవితం తెల్లారినట్లే.




అయినా నేనెందుకు ఇలా ఆలోచిస్తున్నాను? ఒకసారి ఈ పేరుని విడదీసి అసలు అర్థం ఏమిటో విచారిస్తాను. భవము అంటే పుట్టుక. మరి పరా అంటే? మనకన్నా వేరుగా ఉన్నది, గొప్పది అని అర్థం వస్తుంది కదా! భగవద్గీతలో స్వామి **'ఇంద్రియాణి పరాణ్యాహుః ఇన్ద్రియేభ్యః పరం మనః। మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః। 3-42'** అని చెప్పారు కదా! అంటే ఇంద్రియాలు గొప్పవి. వాటికంటే మనస్సు గొప్పది. దానికంటే బుద్ధి గొప్పది. అయితే ఆ బుద్ధి కంటే గొప్పదై వీటన్నింటినీ ప్రకాశింపజేసేది ఆత్మవస్తువు. ఆ ఆత్మవస్తువే 'పరా'. దానినుంచి వుద్భవించిన మనం పరాభవులం. ఆత్మనుంచి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి, ఓషధులు, అన్నము, పురుషుడు ఇలా ఒక క్రమంలో ఉద్భవించాయని ఉపనిషద్వాక్యం కదా!

అలాగే మన వాక్కును కూడా నాలుగు రకాలుగా చెప్పారు కదా! పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరీ - మనలో నిరంతరం కలిగే సంకల్పాలకు బీజరూపం పరా. అంటే సంకల్పం కంటే ముందు స్థితి. దీనికి భాష, రూపము ఉండవు. నీలో సంకల్పం కలగడానికి ఆరు నెలల ముందే నాకు తెలుస్తుంది అని శ్రీ బాబూజీ మహరాజ్ వారు చెప్పేవారు కదా! ఆ మునుపటి స్థితే పరా. ఆ తరువాత అది మెల్లగా ఒక రూపాన్ని సంతరించుకొని ఆలోచనగా పరివర్తన చెందుతుంది. అదే పశ్యంతి.

ఆ ఆలోచన ఒక భాషను ఆధారం చేసుకొని వృద్ధి పొంది పదాలుగా, వాక్యాలుగా విస్తృతం అవుతుంది. అయినా ఇంకా మనస్సులోనే వుంటుంది. అది మధ్యమా వాక్కు. ఎప్పుడైతే అది మన ముఖస్తుగా వెలువడి బయటి వారికి వినిపించే రూపాన్ని పొందుతుందో అప్పుడది వైఖరీ అని పిలువబడుతుంది.

మనం రోజూ చదివే నారాయణోపనిషత్తులో చూస్తే నారాయణుని బీజరూపమైన సంకల్పం నుండి ముందుగా ప్రాణము, మనస్సు, ఇంద్రియములు, పంచభూతములు, బ్రహ్మాది దేవతలు, ఈ సకల చరాచర సృష్టి వుద్భవించిందని చెబుతోంది కదా! అంటే మనందరము ఆ పరవస్తువైన నారాయణుని నుంచే ఉద్భవించాము కదా! అందుకే శ్రీ గురుదేవులు ఎప్పుడూ **'పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవ'** అనే శ్లోకాన్ని ఇష్టపడేవారు కారు. "నువ్వు పాప సంభవుడవు కావు. ఆత్మ సంభవుడవు. అది గుర్తించక నేను పాపిని అనుకొని బంధానికి లోనవుతున్నావు. నువ్వు మేకల మధ్యలో పెరిగిన సింహానివే కానీ మేకవు కావు. నీ నిజస్వరూపాన్ని నువ్వు దర్శిస్తే నువ్వు ఎప్పుడూ ముక్తపురుషుడవే" అని చెప్పేవారు. కాబట్టి మనమే పరాభవులం.

ఇంకొక రకంగా ఆలోచిస్తే పరులనుంచి మనకు కలిగేది పరాభవం. ఎవరో ఏదో అన్నారని, లేదా అంటారని నిత్యం మనని మనం మార్చుకుంటూ, వాళ్ళ మెప్పు పొందాలని తహతహలాడుతూ ఉంటాం. కానీ ఎప్పుడైతే మన మనస్సు బైటినుంచి వచ్చే తన్మాత్రలకు ప్రతిస్పందించడం మానేసి పరమైన ఆత్మలో లీనమై ఉంటుందో అప్పుడు మనకు పరాభవమే ఉండదు కదా! స్థితప్రజ్ఞ లక్షణం అదే కదా! తనను తాను గుర్తించి సదా స్వస్వరూప స్థితిలో ఓలలాడే మహాత్ముని ఎవరు పరాభవించగలరు? అటువంటి వ్యక్తికి రాజపూజ్యం, అవమానం మధ్య తేడా ఏమి తెలుస్తుంది? అవి వారిని చలింపజేయలేవు కదా!

కాబట్టి ఈ అల్పమైన రాశిఫలాలను వదిలేసి అత్యుత్తమమైన మన పరాస్థితిని తెలుసుకోమని ఈ పరాభవ నామ సంవత్సరం మనకు సందేశం ఇస్తోంది. చూశావా! నిరాశా నిస్పృహల నుంచి కూడా శ్రీ గురుదేవులు ఎటువంటి విచారణను కలిగించి దివ్య సందేశాన్ని అందించారో! దేశకాలాలు ఏవైనా నిరంతరం ఇటువంటి సద్విచారణ మాలో నిలబడాలని ఆశీర్వదించండి గురుదేవా!

# సద్గురు సమర్థత - నిరూపణ

- జగన్నాథ ప్రసాద్

ఒకసారి శ్రీశైలంలో పాదపూజ అయిన తరువాత, ఒక భక్తుడు శ్రీబాబుతో, "బాబూ! తిరుపతి వెళ్ళి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటాను" అన్నారు. శ్రీబాబు "తిరుపతి వెడతారా? వెంకన్న మా బ్రదరే! వాడే వీడు – వీడే వాడు" అన్నారు. ఇది విన్న శ్రీ తారకం (సన్నిధానం తారక పరబ్రహ్మ శాస్త్రి) గారు "ఏమిటీ! ఈయన ఇలా అంటున్నారు? ఈయనకు, వేంకటేశ్వర స్వామికి తేడా లేదని వీరి ఉద్దేశ్యమా? దీని సంగతేమిటో చూడాలి" అని మనస్సులో అనుకున్నారు. ఒకరోజు శ్రీ తారకం గారు ఎవ్వరికీ చెప్పకుండా, తెలియకుండా తిరుపతి వెళ్ళి, "నాకు ఇక్కడ ఈ రోజు శ్రీబాబు కనిపించాలి. అలా అయితేనే, బాబు చెప్పిన 'వాడే వీడు – వీడే వాడు' అనేది విశ్వసిస్తాను" అని అనుకున్నారు. శ్రీబాబు తిరుపతి వెళ్ళారు. తారకం గారికి దర్శనం కలిగించారు.

అటువంటిదే హైదరాబాద్‌లో నాకు కలిగిన మధురామృత అనుభవం:

21-11-2025 రాత్రి 'అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' నాటకం గురించి ఆలోచిస్తూ సుమారు 11 గంటలకు పడుకున్నాను. సుమారు 4-30 గంటలకు మెలకువ వచ్చింది. అప్పుడు (మెలకువలో) నేను అనుకున్నాను "ఇప్పుడు నాకు శ్రీబాబు కనిపిస్తే వారి సమర్థత గురించి పూర్తిగా విశ్వసిస్తాను" అని. బాబుకు షరతా?! కళ్ళు మూసుకున్నాను. నిద్ర పట్టింది. కలలో .......

నేను పడుకున్న మంచం వెనుక వైపు నుంచి (తల భాగం నుంచి) ఎవరో వచ్చారు. ఎడమ ప్రక్కగా వచ్చారు. శ్రీబాబు! "బాబూ!" అని చాలాసార్లు పిలిచాను, నమస్కారం చేశాను. నవ్వుతూ, నెమ్మదిగా నడుచుకుంటూ నాకు ముందు వైపుకు వచ్చారు, కుడి ప్రక్కగా వచ్చారు. బాబు కనిపించినంత సేపూ నేను, "బాబూ! బాబూ!" అని సంతోషంతో పిలుస్తూనే వున్నాను, నమస్కారం చేస్తూనే వున్నాను. అంతకంటే ఎక్కువ మాటలు నా గొంతు నుంచి రాలేదు. నాకు కుడి ప్రక్కగా వచ్చి శ్రీబాబు వెంటనే మాయమయ్యారు. హృదయంలో ఆనందం సముద్రంలా ఉప్పొంగి, "I AM THE SECOND TARAKAM GARU" అని గట్టిగా అరిచాను. (పాఠకులు తిట్టుకోవద్దు. ఈ అరుపు గర్వంతో వచ్చింది కాదు, సాగరమంత సంతోషంతో!) మెలకువ వచ్చింది. టైమ్ 4-40 గం.

ధన్యోస్మి గురుదేవా! సమర్థ సద్గురుదేవా!

(గత సంచిక తరువాయి) # నాదోపాసన

-భాగవతుల హనుమత్ జయప్రద

మరొక సందర్భములో త్యాగరాజు మామయ్య కోపంతో, ఇంకొందరు బంధువుల ప్రేరణతో రాముడి విగ్రహాన్ని తీసుకుపోయి కావేరి నదిలో పడేశాడు. ఇది తెలియగానే త్యాగరాజు కన్నీళ్ళు ఆపుకోలేక పోయాడు. కొన్నిరోజులు పాటు అన్నం తినకుండా 'రామా! నీవు తప్ప వేరెవరూ నాకు లేరు' అని విలపించాడు. శ్రీరాముడు ప్రత్యక్షమై "నన్ను సత్వరమే కనుగొంటావు" అన్నాడు. కావేరి తీరం వెంబడి వెళ్తుంటే, ఒక కొమ్మకి నీరు తాకే చోట ప్రతిమ వెలుగుతూ కనిపించింది. త్యాగరాజు ఆనందంతో రాముణ్ణి ఎత్తుకొని ఆలింగనం చేశాడు. అప్పడే ఆయన పాడినది: "నను బ్రోవకను విడువనురా రామ" అని.

ధ్యానములో రామ దర్శనం నాదోపాసన ఫలం - ఒక రోజు త్యాగరాజు సంగీత ధ్యానంలో అంతగా మునిగిపోయాడు. బాహ్య ప్రపంచం అంతా లీనమైపోయింది. రాగం, తాళం, శ్రుతులన్ని నిశ్శబ్దంలో లీనమయినవి. అప్పడు శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు అంతఃకరణంలో ప్రత్యక్షమై పరిపూర్ణ దర్శనం ఇచ్చారని చెబుతారు.

కరువు సమయంలో చేసిన ప్రార్థన - తిరువయ్యారులో ఒకసారి తీవ్రమైన కరువు వచ్చింది. జనం దప్పికతో బాధపడుతూ, జీవితం కష్టంగా మారింది. త్యాగరాజు ప్రజల బాధను చూసి, ప్రార్థించాడు. కొద్ది గంటల్లోనే ఆకాశం చీలి వర్షం కురిసింది. కావేరి ప్రవహించింది. గ్రామం శాంతిని పొందింది.

ఒకానొకప్పడు త్యాగరాజస్వామి దక్షిణ దేశమునకు వచ్చి తిరిగి వెళ్ళిపోతున్నారు. అప్పడు ఒక జమిందారుగారు ఆయనకు కొంత డబ్బు ఇద్దామని అనుకుని శిష్యుని పిలిచి కొంత పైకమును చేతిలో పెడితే, అతను 'మా గురువుగారు తీసుకోరు' అని చెప్పాడు. జమిందారు 'మీ గురువుగారికి ఇవ్వడము లేదు, ఆయన శ్రీరామ నవమికి సీతారామ కళ్యాణము చేస్తారు కదా, ఆ నిమిత్తముగా ఖర్చు చెయ్యడానికి' అని చెప్పాడు. 'అయితే ఇది రామునికి ఇస్తున్నారా?' అని అడిగితే అవును అన్నాడు జమిందారు.

- సశేషం

## శ్రీ కాళీప్రసాద ఆశ్రితాశ్రయం చతుర్థ వార్షికోత్సవం నందికొట్కూరు

శ్రీ కాళీప్రసాద ఆశ్రితాశ్రయం, నందికొట్కూరు నందు, నంబూరు నుండి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ మాతాజీ గారు ఆశ్రయాన్ని సందర్శించి, ఆధ్యాత్మిక ప్రవచనాలతో అందరినీ అనుగ్రహించారు. మాతాజీ గారు తమ ఆశీర్వచనాలలో మాట్లాడుతూ, "ఈ నందికొట్కూరు ఆశ్రయం ఎంతో చక్కగా ఉంది. ఇది మా ఆశ్రయాన్ని తలపింపజేస్తోంది" అని ప్రశంసించడం అందరికీ అపార ఆనందాన్ని కలిగించింది.

ఈ పవిత్ర కార్యక్రమంలో గౌరవ సలహాదారు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి శ్రీ పల్లె మోహనరావు గారు, వ్యవస్థాపకులు శ్రీ పెద్దచెంచిరెడ్డి ధర్మారెడ్డి గారు, శ్రీ ఎల్. నరసింహ రెడ్డి గారు, శ్రీ శివరాం గారు, స్థలదాతలు, గది దాతలు, అన్నదాతలు, కమిటీ సభ్యులు మరియు మాతాజీ శిష్యబృందం విశేషంగా పాల్గొన్నారు.

ఈ సభకు శ్రీ పల్లె మోహనరావు గారు అధ్యక్షత వహించగా, దాదాపు 400 మంది భక్తులు మరియు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అధ్యక్షులు శ్రీ వి. రంగస్వామి గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

**13. దేహినో-స్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా**
**తథా దేహాంతర ప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! దేహవంతులు, బాల్యం నుండి కౌమారంలోనికి, కౌమారం నుండి యౌవనములోనికి, యౌవనము నుండి వృద్ధాప్యములోనికి, బాల్యము, కౌమారము, యౌవనము, వార్ధక్యము అను మార్పులు చెందుతూ ప్రవేశిస్తారు. అలాగే చివరకు ఏదో ఒకప్పుడు ఈ దేహాన్ని వదలి మరొక దేహాన్ని ధరించటం జరుగుతుంది. ఇది తెలిసిన విజ్ఞానులు, ధీరులు కావటం వలన ఈ మార్పులను గూర్చి భ్రమ చెందరు" అని అన్నాడు.



పుట్టటం, పెరగటం, ఉండటం, మరణించటం మొదలైన షడ్భావ వికారములు దేహ ధర్మములు. కాని దేహి అయిన ఆత్మకు ఈ వికారాలు ఏవీ లేవు. అయినప్పటికి ఆత్మ దేహమందు అదృశ్యంగా ఉండటం వలన, దేహము నుండి ఆత్మను వేరుచేసి చూడలేని అజ్ఞులు దేహమునే ఆత్మగా, దేహధర్మాలను ఆత్మ ధర్మాలుగా భ్రమిస్తారు. ఒక పిల్లవాడు శైశవము నుండి బాల్యంలోకి అడుగు పెట్టినప్పుడు కాని, అందులో నుండి కౌమారంలోనికి అడుగు పెట్టినప్పుడు గాని, కౌమారం నుండి యౌవనంలోకి అడుగు పెట్టినప్పుడు గాని, యౌవనంలో నుండి వార్ధక్యంలోకి అడుగు పెట్టినప్పుడు గాని నీవు దుఃఖిస్తున్నావా? అదే విధంగా దేహి ఒక దేహాన్ని వదలి మరొక దేహాన్ని ధరిస్తున్నప్పుడు నీవు చూస్తున్న మార్పు, లేదా వికారం కూడా షడ్భావ వికారాలలో ఒకపెద్ద వికారం మాత్రమే. మిగిలిన వికారాలను గురించి నీవు ఎలా దుఃఖించటం లేదో దీనికి కూడా అలాగే విచారించ నవసరము లేదు.

ఏదైనా విషయం విశదీకరించటానికి మనం ఉపమానాలను, వుదాహరణలను ఉపయోగించినట్లే శ్రీకృష్ణ భగవానుడు కూడా ఉదాహరణల ద్వారా అర్జునుడికి బోధామృతాన్ని అందిస్తున్నాడు. దేహి జన్మించినపుడు శిశుదేహంతో వుంటాడు. ఆ తరువాత అతడు కౌమారావస్థలో అడుగు పెడతాడు. ఆ తరువాత

యౌవనుడు అవుతాడు. ఆపైన వృద్ధుడు అవుతాడు. చివరకు ఆ దేహాన్ని వదలి ఇంకొక దేహాన్ని ధరిస్తాడు. మళ్ళీ అక్కడ కూడా ఇదే వరస. మరల అక్కడ కూడా ఆ దేహాన్ని వదలివేసిన తరువాత వేరే ఇంకొక శరీరాన్ని ధరిస్తాడు. నీవు గ్రహించవలసింది ఏమిటంటే, ఈ దేహాలన్నింటిని ధరిస్తున్న, మరణము లేని, ఏ మార్పూ చెందని, దేహి ఒకడున్నాడు అని, అతనినే, లేదా దానినే ఆత్మ అని పిలుస్తున్నాము అని. ఈ ఆత్మ యొక్క ఉనికి వలన మనలో చైతన్యము, మన రకరకాల చేతలకు మధ్య సంధానము సంభవము అవుతున్నాయి. నీవు నీ కనులకు కనిపించే జీవితమే నిజమైనదని భావిస్తున్నావు. జీవితంలో బాల్యము మొదలైన మార్పులు ఉన్నట్లే, మరణము అనే చాలా పెద్ద మార్పు ఉన్నది. విజ్ఞులు దీనిని గురించి భ్రాంతి చెందరు.

ఈ విధంగా నీవు నీ జీవితాన్ని గమనిస్తే, రెండు అంశాలు గోచరిస్తాయి. ఒకటి అనుక్షణమూ మార్పు చెందుతున్న నీ దేహం, రెండవది ఏమార్పూ చెందని, ఏ వికారమూ లేని సర్వాధిష్ఠానమైన ఆత్మ. బాల్యంలో నుండి కౌమారంలో అడుగు పెట్టటం వంటివి చిన్న చిన్న మార్పులు అయితే, మరణం అనేది, అంటే దేహి ఒక దేహాన్ని వదలి మరొక దేహాన్ని ధరించటం అనేది, చాలా పెద్ద మార్పు. నీవు సముద్రాన్ని చూస్తే అందులో మార్పు లేదు. కాని అలలను చూస్తూ ఉంటే అవి అనుక్షణం మారిపోతూ ఉంటాయి. నిజం తెలుసుకోకుండా ఇలా నిత్యమూ మార్పుకు గురిఅయ్యే వాటిని నిత్యము అని భ్రమిస్తే, అది దుఃఖకారణం అవుతుంది.

నీకూ, అలాగే వీరందరకూ మూలమైన సచ్చిదానందం ఏదైతే ఉన్నదో, దానిని దర్శించు. నీ దుఃఖం నివారణ అవుతుంది. కాని ఆ సత్యవస్తువును నీవు దర్శించాలి అంటే, దానికి ముందుగా నీ అంతఃకరణమును నిర్మలంగా చేయాలి. దానికి నీ మనస్సు ప్రసన్నంగా అంటే నిర్మలంగా నిస్తరంగంగా కావాలి. అందుకు, అహంకార మమకారములు లేకుండా, కర్తృత్వ – భోక్తృత్వ అభిమానం లేకుండా, నీ స్వధర్మాన్ని చక్కగా నిర్వర్తించటమే మార్గం. భగవంతుడే కర్త, నడిపేవాడు, ఆయనే మంత్రి. నీవు ఆయన ఎలా నడిపితే అలా నడిచే యంత్రానివి మాత్రమే అనే భావనతో భగవదర్పితంగా నీ స్వధర్మాన్ని ఆచరించాలి.

- సశేషం

## స్వామి దయానంద మహరాజ్

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళి

కైలాశ్ ఆశ్రమంలో వేదగ్రంథాల అధ్యయనం, ధ్యానం మరియు యోగ సాధనలు కొనసాగుతుండగా, అక్కడ ఉన్న సంత్ మండలి సర్గోధా (ప్రస్తుతం పాకిస్తాన్‌లో)కి వెళ్ళాలని నిర్ణయించుకుంది. మహా మండలేశ్వర్ విష్ణుదేవానంద గిరి, స్వామి స్వయంభూజీ, స్వామి హరిహర్ తీర్థ, దయానంద స్వామీజీ మరియు మరికొందరు సన్యాసులు సర్గోధా చేరుకున్నారు. సర్గోధాలో సుమారు నెల రోజులు సత్సంగములు జరిగిన తరువాత, సమీప పట్టణమైన సహివాల్ (ప్రస్తుతం పాకిస్తాన్) మేజిస్ట్రేట్ అయిన శ్రీ రాధా కృష్ణ, ఆధ్యాత్మిక సత్సంగ్‌లో పాల్గొని, సంత్ మండలిని సహివాల్‌కు ఆహ్వానించి, ఆ పట్టణ ప్రజలకు పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక జ్ఞానం ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన సంత్ మండలి వసతి మరియు కార్యక్రమాల కోసం తన అధికారిక బంగ్లాను కూడా అందుబాటులో వుంచారు.

ఈ సమయంలో, స్వామీజీ ఆధ్యాత్మిక మార్గాన్ని అవలంబించేందుకు తీసుకున్న నిశ్చయం మరియు స్థిరతకు పరీక్షలా ఒక సంఘటన చోటుచేసుకుంది. స్వామీజీ చిన్నతనంలో సర్గోధాలో చదువుతుండగా, ఆయనతో కలిసి చదివిన మరియు ఆడిన ఒక బాలిక, పెళ్ళి తరువాత సహివాల్‌లో స్థిరపడింది. ఆమె కూడా సత్సంగ్‌కు హాజరయ్యేది. ఆమెకు స్వామీజీ 19 ఏళ్ల వయసులో ఇంటిని వదిలివెళ్ళిన సంగతి తెలిసినది, అలాగే అతని కుటుంబ సభ్యులు ఎంతగా అతన్ని వెతుకుతున్నారో ఆమెకు తెలుసు. ఆమె స్వామీజీని చూసి, ఇప్పుడు ఆయన గడ్డం పెంచుకుని వున్నప్పటికీ, తన చిన్ననాటి ఆటదొంగ మదన్‌లాల్‌గా గుర్తించింది. ఆమె తన భర్తకు చెప్పి, ఇద్దరూ కలిసి షాహ్‌పూర్‌కు వెళ్ళి స్వామీజీ కుటుంబానికి సమాచారం ఇచ్చారు. స్వామీజీ తండ్రి పెద్దకుమారుడు మునీలాల్‌ను, స్వామీజీని తిరిగి ఇంటికి తీసుకురావాలని పంపారు. మునీలాల్ సహివాల్ చేరుకుని స్వామీజీని కలసారు. అన్నదమ్ములు ఇద్దరూ ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని, కుటుంబ విషయాలు చర్చించుకున్నారు. మునీలాల్ స్వామీజీతో అమ్మా, నాన్నగారితో సహా మొత్తం కుటుంబం నీ జ్ఞాపకంతో బాధపడుతూ, కన్నీళ్ళు పెట్టుకుంటూ ఉన్నారు. నీవు తిరిగి

ఇంటికి రావాలి అని చెప్పారు. అప్పుడు స్వామీజీ ఎంతో మృదువుగా, కానీ స్థిరంగా ఇలా అన్నారు: "ఇప్పుడు నాకు ఇంటికీ, కుటుంబ సభ్యులకీ ఎలాంటి సంబంధం లేదు. నేను మా గురుదేవుల అనుమతి లేకుండా సంత్ మండలిని వదిలి రావటం సాధ్యం కాదు."

అప్పుడు శ్రీ మునీలాల్, స్వామీజీ గురువు అయిన మహా మండలేశ్వర్ స్వామి విష్ణుదేవానంద గిరిజీని కలిశారు. ఆయన ముందు తండ్రి, తల్లిగార్ల అధిక వయస్సు వల్ల కలిగిన బాధలు, కుటుంబ సభ్యుల ఆవేదనను వివరించారు. అప్పుడు మహామండలేశ్వర్ స్వామీజీ ఆదేశానికి శిరసావహించిన స్వామీజీ, తన అన్నతో కలిసి ఇంటికి వెళ్ళాడు. మదన్‌లాల్ మరియు కుటుంబ సభ్యుల పునఃకలయిక కన్నీళ్లతో, వుద్వేగంతో, ఆనందభరితమైనది. తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు స్వామీజీని సన్యాసమార్గం వదలిపెట్టి మళ్ళీ కుటుంబ జీవితంలోకి రావాలని చాలా విజ్ఞప్తి చేశారు. కానీ స్వామీజీ మృదువైన స్వరంలో కానీ, దృఢమైన నిర్ణయంతో ఆధ్యాత్మిక మార్గాన్ని కొనసాగించాలన్న తన సంకల్పాన్ని స్పష్టంగా వెల్లడించారు. ఇది కుటుంబ సభ్యులకు నిరాశ కలిగించింది. కొన్ని రోజులు గడిచిన తర్వాత స్వామీజీ, తన తండ్రిని సంత్ మండలికి తిరిగి వెళ్ళేందుకు అనుమతి కోరారు.

స్వామీజీ తన తండ్రితో "నేను ప్రతి సంవత్సరం లోకయాత్రలో తపస్సు చేస్తున్నప్పుడు కనీసం ఒకసారి మన ఊరికి రావడానికి ప్రయత్నిస్తాను. అవసరమైతే నా ఇతర అన్నలకు తోడుగా ఉండి సేవ చేస్తాను." అని చెప్పారు. కుటుంబ సభ్యులందరూ స్వామీజీ తండ్రికి ధైర్యం చెబుతూ, "మీకు ఇలాంటి ఆధ్యాత్మిక మార్గాన్ని అవలంబించిన కుమారుడు ఉన్నాడు. ఇది గర్వకారణం" అని అభినందించారు. తండ్రి శ్రీ ఘసీటారామ్‌గారు కన్నీళ్లతో అనుమతి ఇస్తూ "మన ఊరు హెూషియార్‌పూర్ సమీపంలో చిన్న కుటీరం కట్టిస్తాను. అది నీ కొరకు ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉంటుంది" అని చెప్పారు. ఈ కుటీరం ఇప్పటికీ 'గిరి కుటీర్' పేరుతో చండీగఢ్ హెూషియార్‌పూర్ రహదారిపై, హెూషియార్‌పూర్ పట్టణానికి 4, 5 కిలోమీటర్ల దూరంలో ఉంది.

- సశేషం

# సమర్థ సద్గురు

[యాజమాన్యం తదితర వివరాలు]

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | | |
|---|---|---|
| ప్రచురణ స్థలం | - | శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - | మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - | పాలూరి శివరామ కాళీప్రసాద్ |
| జాతి | - | భారతీయుడు |
| విలాసము | - | D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - | పాలూరి శివరామ కాళీప్రసాద్ |
| జాతి | - | భారతీయుడు |
| విలాసము | - | D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - | యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియజేస్తున్నాను.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) పాలూరి శివరామ కాళీప్రసాద్

ది. 1-3-2026

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**111. ఓం క్షేత్రజ్ఞాయ నమః**

శ్రీ గురుదేవులు తమ శిష్యుల హృదయ క్షేత్రాలను బోధయనే నాగలితో దున్ని, అందులో భక్తి అనే బీజాలు నాటి, జ్ఞానమనే నీరు పోసి, వైరాగ్యమనే ఎరువు వేసి, సంకల్పాలనే కలుపు మొక్కలను పెరికివేసి, కామ క్రోధాది చోరుల నుండి నిరంతరం కాపు కాసి, ఆత్మానందమనే ఫలాన్ని పండించి, ఆ పంటను ప్రపంచమంతటికీ పంచిపెట్టే అద్భుతమైన వ్యవసాయదారులు.

**112. ఓం పురుషోత్తమాయ నమః**

ఈ మూడు లోకములలోని సకల చరాచర జీవ జాలమునకు చైతన్యాన్ని, శక్తిని ప్రసాదించి, ఈ జగన్నాటకాన్ని నిరాటంకంగా నడిపే ఆ పరబ్రహ్మ స్వరూపుడైన పురుషోత్తముడే శ్రీగురుదేవులు.

**113. ఓం జగద్గురవే నమః**

శ్రీ గురుదేవులు ఈ జగత్తులోని సకల చరాచర భూతజాలానికి ఆధారమై వారి మనస్సులోని అజ్ఞాన అంధకారమును తొలగించి, జ్ఞాన భాస్కర కిరణాలను ప్రసరింపజేసి, వారిని ఆత్మానందానుభూతిలో ఓలలాడేటట్లు చేసే సమర్థ సద్గురు దేవులు.

**114. ఓం అమేయాత్మనే నమః**

శ్రీ గురుదేవులు సర్వత్రా వ్యాపించి యున్నటువంటి పరమాత్మ స్వరూపులు. ఈ ప్రపంచములో వారు లేని ప్రదేశము ఎక్కడనూ లేదు. వారు సర్వ వ్యాపకుడైన విష్ణు స్వరూపులు.

**115. ఓం జన్మ దుఃఖ విమోచనాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యులకు తమ జ్ఞాన బోధ ద్వారా వారిలోని అజ్ఞానమును తొలగించి, వారిని జ్ఞాన స్వరూపులుగా మార్చి, వారికి శాశ్వతమైన మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించి వారిని జన్మ పరంపర నుండి, సకల ప్రాపంచిక దుఃఖముల నుండి విముక్తులను చేయగల సమర్థులు.

**116. ఓం తత్త్వదాత్రే నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యులకు స్వస్వరూప జ్ఞానాన్ని ప్రసాదించి, ఈ చరాచర జగత్తులో అంతటా నిండియున్న పరమాత్మ వస్తువు తాను అనే

జ్ఞానాన్ని తమ శిష్యులకు కలిగించగల సమర్థులు.

**117. ఓం సదా యోగినే నమః**

శ్రీ గురుదేవులు ఎల్లప్పుడూ స్వస్వరూప అనుభవ ఆనంద స్థితిలో ఓలలాడుతూ ఉంటారు. యోగం అనగా జీవాత్మ, పరమాత్మల అనుసంధానమని వేదాంత వాక్యములలో చెప్పబడినది. అట్లే యోగమనగా చిత్త వృత్తులను నిరోధించుటయని యోగ శాస్త్రములో చెప్పబడినది. యోగమనగా కర్మలు చేయుటలో కౌశల్యమని శ్రీభగవద్గీతలో చెప్పబడినది. ఇవి అన్నియు శ్రీ గురుదేవుల విషయంలో ఎల్లప్పుడూ సత్యమే.

**118. ఓం లసత్తత్త్వ ప్రకాశకాయ నమః**

ఈ సమస్త జగత్తుకు చైతన్యమునిచ్చి ప్రకాశింపచేసే ఏ పరమాత్మ వస్తువైతే ఉన్నదో అదే నీవు అనే తత్త్వ జ్ఞానాన్ని తమ శిష్యులకు బోధపరచి వారిని పరమాత్మ స్వరూపులుగా, ఆత్మ జ్ఞాన సంపన్నులుగా ప్రకాశింప చేయగల సమర్థులు శ్రీ గురుదేవులు.

**119. ఓం సముత్పాటిత సంకల్పాయ నమః**

శ్రీ గురుదేవులు వారి శిష్యుల హృదయ క్షేత్రాలలో మొలకెత్తే సంకల్పాలనే కలుపు మొక్కలను సమూలంగా పెకలించివేసి, వారిని జన్మ పరంపర నుండి ఉద్ధరించి, మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించ గల సమర్థులు.

**120. ఓం సంసార భయ నాశనాయ నమః**

తమను ఆశ్రయించిన శిష్యుల ప్రాపంచిక భయాలనన్నింటినీ తొలగించి వారికి అండగా నిలిచి వారిని పారమార్థిక సాధనలో ముందుకు నడిపించే అభయ ప్రదాత శ్రీగురుదేవులు.

- సశేషం

**భూమిపై వున్న అన్ని జీవరాశులలోకి మానవజన్మ మహోత్కృష్టమైనది. కేవలం తినడం, త్రాగడం, సుఖించడం, ధనం ఆర్జించడమే మానవ జన్మకి పరమార్థం కాదు. భగవానుడు ఈ క్షణిక సుఖాల కోసం ఈ మానవ జన్మను ప్రసాదించలేదు. అజ్ఞానపు పొరలను, అరిషడ్వర్గాలను ఛేదించుకుని, జ్ఞానరాసులను ప్రోగుచేసుకుని, ఆత్మ సాక్షాత్కార సాధనతో దైవసాన్నిధ్యం పొందడమే మానవ జీవిత పరమ లక్ష్యము.**


- శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

"అవును. నేను కృష్ణుని తల నిమురుతూ అడిగాను 'నాయనా! ఈ అభాగ్యురాలైన నీ తల్లి చేతులు ఏమి అపరాధం చేశాయి? నేను వడ్డించిన నీకు ప్రియమైన ఈ మృష్టాన్నములు తినకుండా నీవు కంటనీరు పెడుతున్నా వెందుకు?" అని. దీనికి బదులుగా కృష్ణుడేమన్నాడో తెలుసా కౌంతేయా? "అమ్మా! నేను గోకులం నుంచి మధురకు వచ్చేముందు, నేను తిరిగి నీ దగ్గరకు వస్తాను. నీ దగ్గరకు తిరిగి రానంత వరకు నాకు ప్రియమైన వెన్న కలకండలను ముట్టను' అని యశోదమ్మకు మాట ఇచ్చాను తల్లీ. ఒక వైపు



యశోదమ్మకిచ్చిన మాట! ఇంకొక వైపు నా తల్లి ప్రేమగా వడ్డించిన మధురభక్ష్యాలు... అమ్మా! నువ్వే చెప్పు. ఇద్దరు తల్లుల ముద్దు బిడ్డను కదా! అందుకనే ఈ ధర్మ సంకటంలో ఇరుక్కొన్నాను' అని"

'మరి అప్పుడు కృష్ణుడేం చేశాడు?' అర్జునుడు కుతూహలంగా ప్రశ్నించాడు.

'అప్పుడు కృష్ణుడు ఏం చేయాలో అదే చేశాడు. నా ప్రేమ స్వార్థం వల్ల వచ్చినది కదా! కాని తాను యశోదకిచ్చిన మాట స్వార్థంతో కాదు, త్యాగంతో చేసినది. త్యాగం ప్రేమ కంటే ఎంతో ఉన్నతమైనది.' దేవకి ఇంక మాట్లాడలేక మౌనంగా వెక్కిళ్ళ మధ్య దిండులో తల దూర్చింది. "ఇంక... ఇంక... నా చేతులతో నా తండ్రికి ఎన్నటికీ వెన్న, కలకండలను తినిపించలేనేమో కదా అర్జునా! ఎన్నటికీ తినిపించలేనేమో! కృష్ణుడు నీకు కనిపిస్తే 'అభాగ్యురాలైన నీ తల్లి దేవకి నీ కొరకు కళ్ళలో వత్తులు వేసికొని ఎదురు చూస్తోంది' అని చెప్పు నాయనా!'

అర్జునుడు నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ ఉండిపోయాడు. అతని మనస్సు వికలమైంది. దేవకి అన్నమాటలు అన్ని వైపుల నుంచి మారుమ్రోగుతున్నాయి. అభాగ్యురాలైన నీ తల్లి దేవకి నీ కొరకు ఎదురు చూస్తోంది... అభాగ్యురాలైన నీ తల్లి దేవకి నీ కొరకు ఎదురు చూస్తోంది.....

అర్జునుడు  వసుదేవుని వైపు చూశాడు. వసుదేవుని కళ్ళు చెమ్మగిల్లాయో లేదో చెప్పటం కష్టం. ఎందుకంటే అవి లోతుకు కూరుకుపోయాయి. దేవకి, అర్జునుడికి మధ్య జరిగిన సంభాషణ అతడు విన్నదీ, లేనిదీ అతని ముఖ కవళికలను బట్టి చెప్పటం కష్టం.

'తండ్రీ!' అర్జునుడు నెమ్మదిగా పిల్చాడు. 'అర్జునా!' ఒక్కసారి మెలకువ వచ్చినవానిలా ఉంది వసుదేవుని కంఠ స్వరం. అతని దృష్టి ఎక్కడో శూన్యంలో లయించి పోయింది. 'కంసుని కారాగారం నుండి విముక్తిని కలిగించి, మొదటిసారిగా నాకు పాదాభివందనం చేసిన రోజున.... ఆ క్షణం ఇప్పటికీ మరువలేను. ముద్దులు మూటకట్టుతున్న నా ఏ చిన్నారి శిశువును మేఘావృతమై వర్షం పడుతున్న ఒకనాటి రాత్రి దాగుతూ, నక్కుతూ, ఒక దొంగలాగా గోకులంలో విడిచి వచ్చానో, ఆ శిశువే కంసుని వధించి నా చరణాలకు మ్రొక్కుతున్న బాలుడు. అతడే కృష్ణుడని ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నాను. 14 సంవత్సరముల తరువాత కృష్ణుణ్ణిచూస్తున్నాను... పూర్తి 14 సంవత్సరాల తరువాత...... ఆ 14 సంవత్సరాలు ఎలా గడిచాయో!'

అర్జునుడికి వసుదేవుణ్ణి అనునయించటం కష్టమైపోయింది. అతను మాట మార్చడానికి ప్రయత్నిస్తూ 'తండ్రీ! కారాగారవాసం, ఆ దుర్భర దినాలు ఎప్పుడో గడిచిపోయాయి కదా! ఆ తరువాత కృష్ణుడు మిమ్మల్ని మధుర గణతంత్రానికి, మధురకు పితామహుణ్ణి చేశాడు కదా'

'అవును ధనంజయా! నువ్వు చెప్పేది నిజమే. కాని ఆ కారాగారం నుండి మాకు అప్పుడు ముక్తిని కలిగించిన కృష్ణుడే ఇప్పుడు ఈ కొత్త కారాగారాన్ని విధించాడు కదా!' 'నాకు అర్థం కావటం లేదు' అన్నాడు అర్జునుడు. వసుదేవుడు మౌనంగా నవ్వాడు.

'ఆ కారాగార వాసంలోని 14 సంవత్సరాలు ప్రతీక్షలో గడిచిపోయాయి. కృష్ణుడు గోకులంలో పెరుగుతున్నాడు. మధురలోని వారందరిని కంసుని క్రూర శాసనం నుంచి ముక్తులను చేశాడు' అనే ఆశ మొలకెత్తింది. పూతన మృత్యువు, ధేనుకాసురుని వధ... ఇవన్నీ మాకు తెలుస్తూ ఉండేవి. త్వరలోనే కృష్ణుడు ఏదో ఒకనాడు ఇక్కడికి వస్తాడు అనిపించేది. కారాగారం బయట రివ్వుమని వీచేగాలి, చుట్టూ ఉన్న వృక్ష సమూహం.... కొంచెం అలజడి అయినా అదిగో ! కృష్ణుడు వచ్చాడు అని శ్వాస బిగపట్టి చూసేవాళ్ళం. అర్థరాత్రి వేళ ఢంకా మ్రోగితే కృష్ణుడు ద్వారం దగ్గరికి వచ్చి తలుపు తట్టటం లేదుకదా! అనిపించేది.'


- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 56:నిగౌణీ త్రిధా గుణ భేదాత్ ఆర్తాది భేదాత్ ద్వాని**

తాత్పర్యము: గుణములతో కూడిన గౌణ భక్తి త్రిగుణముల బట్టి మరియు ఆర్తాది భక్తి లక్షణములను బట్టి మూడు విధములుగా చెప్పబడినది. ఈ సూత్రంలో నారదుల వారు పరాభక్తికి భిన్నమై గుణములతో కూడిన గౌణభక్తి గురించి వివరిస్తున్నారు. పరాభక్తిని నిర్గుణ తత్వంతో కూడిన భక్తిగా భావిస్తే గుణములతో కూడిన భక్తి మాధ్యమికమైన భక్తిగా భావించవచ్చు. ఈ గౌణ భక్తి పరిపక్వత చెందిన తరువాత పరాభక్తి, లేక ముఖ్య భక్తికి దారితీస్తుంది. గౌణ భక్తిలో భగవంతుడిని ప్రేమించడం వున్నా, సాధారణంగా ఆ ప్రేమ శుద్ధంగా, స్వార్థ రహితంగా వుండదు. ఈ గౌణ భక్తిలో కోరిక, భయము, ఫలాపేక్ష వంటివి కనిపిస్తూ వుంటాయి. దీనిని సాధన దశలో వున్న భక్తి గా పరిగణిస్తారు. ఇదే భక్తి క్రమంగా పరా భక్తిగా మారుతుంది.



ఈ గౌణభక్తి సత్వ రజస్తమో గుణములను బట్టి అలాగే ఆర్త, జిజ్ఞాసు, అర్థార్థి అన్న మూడు భక్తి విధములను బట్టి త్రిగుణముగా చెప్పబడినది. సాధారణంగా ఆత్మకు భగవంతుని యెడల భక్తి, ప్రేమ చాలా సహజమైన స్వభావము. కాలక్రమేణ అహంకారము, లేక వాసనలు ఆ ప్రేమ ప్రకటితం అవ్వకుండా అడ్డు పడుతుంటాయి. సాధకుడు చిత్త శుద్ధితో క్రమ క్రమముగా ఆ అడ్డంకులను సాధన ద్వారా ఎదుర్కొని తనకు భగవంతుని ఎడల కలిగిన సహజమైన ప్రేమ కోసం ప్రయత్నిస్తాడు. త్రిగుణములైన సత్వ రజో తమో గుణములు అందరిలోనూ ఎల్లవేళలా వుంటాయి. ఆ మూడు గుణములు సమానంగా వున్నప్పుడు ఎటువంటి వ్యవహారము కూడా జరగదు. ఆ మూడింటిలో ఏది ముఖ్యముగా ప్రకటితమవుతున్నదో దానికి సంబంధించిన వ్యవహారం జరుపుతుంటారు. మనస్సు ఏ గుణంతో ప్రభావితమై వుందో, దాని ప్రకారం భక్తి రూపం మారుతుంది. తామస గుణ ఆధారితమైన తామస భక్తిలో భయం, అజ్ఞానం, అలసత్వం ప్రధానంగా వుంటాయి. ఈ తామస భక్తి కలవారు “దేవుడు శిక్షిస్తాడు” అన్న భయం వలన భక్తిగా వుండడం కానీ, లేక ఆపద వచ్చినప్పుడు భగవంతుడిని నిందించడం గానీ జరుగుతుంది. దీనిని ప్రారంభ దశలో వున్న భక్తిగా చెప్పుకోవచ్చు.

రజో గుణ ఆధారితమైన రాజస భక్తిలో కోరికలు ప్రధానంగా కనిపిస్తాయి. వీరు ఆశించిన ఫలితం కోసం మాత్రమే భక్తిగా వుంటారు. ఫలితం అనుకూలంగా రానప్పుడు ఇది తామస భక్తిలోకి దారి తీయడానికి ఆస్కారం వుంటుంది. సత్వ గుణ ఆధారితమైన సాత్విక భక్తి కల వారిలో శాంతి, విశ్వాసం, కృతజ్ఞత ప్రధానంగా వుంటాయి. వీరికి ఫలాపేక్ష

తగ్గి ప్రతిదానినీ భగవంతుడి కృపగా స్వీకరిస్తారు. ఈ భక్తి గలవారికి పరాభక్తి చేరువలో వుంటుంది. రెండవ విధమైన గౌణ భక్తి సంకల్ప భేదమును బట్టి మూడు విధములుగా చెప్పబడుతోంది. భగవద్గీతలో గీతాచార్యులు "**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున। ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥**" అంటూ భక్తులు ఆర్తుడు, అర్థార్థి, జిజ్ఞాసువు మరియు జ్ఞాని అని నాలుగు రకాలుగా ఉంటారని సెలవిచ్చారు. అయితే చివరి రకమైన జ్ఞాని అన్నది పరాభక్తికి ప్రమాణముగా చెప్పబడుతుంది. ఎందుకంటే వారికి భక్తి తప్ప మరియొక ప్రతిఫలాపేక్ష ఏదీ ఉండదు. ఇది కూడా భగవద్గీతలోనే తెలుపబడినది. "**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే**" అంటూ అటువంటి జ్ఞానులు పరాభక్తితో నిత్య యుక్తులై ఉంటారని భగవద్గీత వివరించింది.

ఇక మిగిలిన మూడు విధములైన ఆర్తి, అర్థార్థి, జిజ్ఞాసు అన్న గౌణభక్తి విధములలో ఆర్తుడు ప్రధానంగా దుఃఖము గానీ, కష్టముగాని వచ్చినప్పుడు భగవంతుడిని ఆశ్రయిస్తాడు. దుఃఖము తొలగిన తరువాత ఇటువంటి భక్తి తగ్గిపోవచ్చు. అర్థార్థి ప్రధానంగా కోరికలతో కూడిన భక్తుడు. వీరు భౌతిక ఫలితాల కోసం భగవంతుడిని ఆశ్రయిస్తారు. కోరికలు నెరవేరినంతవరకు ఇటువంటి భక్తి పెరుగుతుంది. మూడవ రకమైన జిజ్ఞాసువులో భగవంతుడు ఎవరు, తత్వము ఏమిటి అన్న ఆధ్యాత్మిక ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. వీరు గ్రంథ పఠనమూ పరిశీలనలో ఎక్కువ శాతం సమయం గడుపుతుంటారు. ఈ సూత్రము ద్వారా నారదులు పైన వివరించిన విధంగా గుణముల మీద ఆధారపడిన గౌణభక్తిలో వున్న వివరాలను వెల్లడిస్తూ సాధకుడు క్రమముగా ఈ గౌణ భక్తి నుంచి పరాభక్తికి చేరుకోవాలన్న సందేశమును అందిస్తున్నారు.

**భక్తి సూత్రము 57: ఉత్తర స్మాదుత్తర స్మాత్ పూర్వః శ్రేయోభవతి**

తాత్పర్యము: తదుపరి దశ కంటే ముందున్న దశే శ్రేష్ఠమైనది. ఈ సూత్రమును ముందు సూత్రమునకు సంబంధ సూత్రముగా చెప్పకోవచ్చు. ముందు సూత్రములో చెప్పబడిన గౌణభక్తిలో ఏది శ్రేష్ఠము అన్నది ఈ సూత్రము తెలియజేస్తుంది. నారదుడు ఇక్కడ గౌణ భక్తిలో ఉన్న భక్తుల స్థాయిలను పోల్చుతూ, ప్రతి తదుపరి స్థాయితో పోలిస్తే ముందున్న స్థాయి భక్తి మరింత శ్రేష్ఠమని వివరిస్తున్నారు. అంటే తామస భక్తి కంటే రాజస భక్తి, మరియూ రాజస భక్తి కంటే సాత్విక భక్తి శ్రేష్ఠము. క్రిందిస్థాయి భక్తిలో ఉన్నవారు క్రమముగా పై స్థాయి భక్తిలోకి చేరడానికి ప్రయత్నించాలి. ఇక్కడ "పూర్వః" అంటే కేవలం వరుసలో ముందున్నదని కాక తక్కువ గుణ సంబంధంతో ఉన్న దశగా అర్థం చేసుకోవాలి. ఆర్తుడు అర్థార్థి, జిజ్ఞాసువులలో అతి తక్కువ ఫలాపేక్ష కలిగినది జిజ్ఞాసువే. అందుకే జిజ్ఞాసువు యొక్క భక్తి అర్థార్థుడి భక్తి కంటే శ్రేష్ఠము. అదేవిధంగా అర్థార్థుడి భక్తి ఆర్తుడి భక్తి కంటే శ్రేష్ఠము. అయితే తమకు ఉన్న భక్తి ఏవిధమునకు చెందినదన్న తికమక పడకుండా క్రమముగా ఫలాపేక్షను తగ్గించుకుంటూ విశ్వాసమును పెంచుకొనడమే సాధకుడి కర్తవ్యం. శ్రీ బాబూజీ మహారాజ్ వారు ఈ అంశమునే తెలియజేస్తూ "గాఢమైన విశ్వాసమే భక్తి" అని బోధించారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మార్చి 2026**

3 మంగళ: ఫాల్గుణ పూర్ణిమ - హెూలీ పండుగ. శ్రీ సద్గురు పాదపూజ.

13 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

17 మంగళ: మాసశివరాత్రి

19 గురు: అమావాస్య

19 గురు: శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది - ఉ. 10.00 గం.లకు పంచాంగ శ్రవణం, అనంతరం శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

20-26 వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం

27 శుక్ర - శ్రీరామ నవమి - ఉ. 5-30 శ్రీసద్గురుపాదపూజ, ఉ. 11గం. శ్రీ సీతారాముల సామూహిక కళ్యాణ మహెూత్సవము, భక్త సమారాధన

31 మంగళ - ఒంటిమిట్ట కోదండరామస్వామి కళ్యాణ మహెూత్సవం - భీమవరం శాఖలో శ్రీసీతారాముల కళ్యాణం.

**ఏప్రియల్ 2026**

2 గురు - చైత్రపూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ.


12 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

15 బుధ - మాస శివరాత్రి

17 శుక్ర - అమావాస్య

20 సోమ - అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

21 మంగళ - శ్రీ శంకరజయంతి - శ్రీబాబు బృందావన మూర్తి ప్రతిష్ఠ 31వ వార్షికోత్సవం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.



# పూర్వజన్మ- పునర్జన్మ

- పెనుమాక నాగేశ్వర రావు

ఇద్దరు కలిస్తే పుడతాం. నలుగురు మోస్తే వెళతాం. ఏడుపొస్తే గుక్కపెడతాం, నిద్ర వస్తే గుర్రుపెడతాం. శ్వాస తీసుకుంటే నాలో దేవుడు వుంటాడు. శ్వాస వదిలేస్తే దేవుడిలో నేనుంటాను అనుకోగలిగిన వారు ఎంత గొప్పవాళ్ళు! వాళ్ళు కదా స్థిరచిత్తులు! అధికులని, అధములని పరమేశ్వరుని దృష్టిలో తేడాలుండవు. ఆయనకు అందరూ సమానమే. అలాంటి తేడాలన్నీ మనుషుల మధ్యనే. మాధవుడికి అందరూ సమానమే. అందుకే ఆయన ప్రేమ స్వరూపుడు.

**ఎన్నో ఏండ్లు గతించిపోయినవి కానీ, ఈ శ్మశాన స్థలిన్ కన్నుల్ మొడ్చిన మందభాగ్యుడొకండైనను లేచిరాడు** అనే పద్యం ఎన్ని సార్లు విన్నాం! వినేంతసేపే వైరాగ్యం ఆవహిస్తుంది. పుట్టినప్పుడు ఉయ్యాల, పోయినప్పుడు మొయ్యాల, మధ్యలో ఏదోటి చెయ్యాల. అన్నాడో మహానుభావుడు. వర్క్ ఈజ్ వర్షిప్ మూల స్వరూపం ఇదేనేమో!

ఇటీవలి కాలంలో తరచుగా వినిపిస్తున్న మాట "కర్మఫలం". జనసామాన్యంలో వినబడే మాట.... పాపం పండుతుందని, పుణ్యం పుచ్చుతుందని. వినడానికి తమాషాగా ఉంది.  పుణ్యం పండాలి, పాపం పుచ్చాలి కదా! ఈ జన్మలో మనకు మంచి జరిగినా, మంచి లక్షణాలు అబ్బినా.... పూర్వజన్మ సుకృతం అని కదా అంటారు. అంటే గతంలో చేసిన మంచిపనుల ఫలితం తరువాతి జన్మలో ఉపయోగ పడుతుందన్నమాట. అలాగే ఈ జన్మలో చేసే సత్కార్యాల ఫలితం రాబోయే జన్మల్లో వుపకరిస్తుందన్నమాట. పొదుపు చేసుకున్న సొమ్ము అవసర కాలంలో వుపయోగపడినట్లు. ఒకరకంగా చెప్పాలంటే కష్టార్జితం పిత్రార్జితంగా మారటం అన్నమాట.

పోయిన జన్మలో ఖచ్చితంగా పుణ్యం చేయబట్టే మనిషి జన్మ లభించటం. అందులోనూ సద్గురుదేవుల ఆశ్రయం దొరకటం జరిగిన య్యనేది నిర్వివాదాంశం. అలాంటప్పుడు తెలిసో తెలియకో కొన్ని పొరపాట్లో, తప్పులో, పాపాలో కూడా కొన్ని చేసే వుంటాం పూర్వ జన్మల్లో.

వాటి ఫలితంగానే ఈ జన్మలో అనారోగ్యాలు, ఆర్థిక నష్టాలు, కష్టాలు, వగైరాలు అనుభవిస్తున్నాం. దాన్నే కర్మఫలం అంటున్నారు.

ఇటీవల బెంగుళూరులో జరిగిన సత్సంగాలలో పూజ్య మాతాజీ బోధలో మిమ్మల్ని చూడంగానే మీ గతజన్మ, అప్పడు మీ కర్మలు, ఇప్పటి ఆ కర్మఫలాలు మహాత్ములకి తెలిసిపోతుంటాయి అన్నారు. మన గురించి అన్నీ తెలిసినవారి అనుగ్రహం కోసం ప్రార్థించటం తప్ప మనం ఏం చేయగలం?

మన విజయేంద్రప్రసాద్ గారు చెప్పినట్లు **నిన్నటి జ్ఞాపకాలతో, రేపటి వ్యాపకాలతో నేటి సంగతినే మరిచేవు...........** అన్నట్లు ఈ సూత్రం పూర్వజన్మకి, పునర్జన్మకీ కూడా వర్తిస్తుంది గదా! పోయిన జన్మ ఏమిటో మనకి తెలీదు. ఏమేం చేశామో అంతకన్నా తెలీదు. వచ్చే జన్మ ఉంటే అది ఏమిటో తెలీదు. అసలు వాటికోసం ఆలోచించకుండా ఇప్పడు లభించిన జన్మలో ఏం చేస్తే భగవంతుడు మనల్ని ఇష్టపడతాడో అది చేస్తూ ఉంటే పోలా? పోతుంది. కానీ అదంతా తేలికా! అలా చేస్తూ వుండటానికి గురు కటాక్షం కావాలనేగా చెబుతున్నారు.

తేలికో, కష్టమో, ఆ భారం ఆయన మీదనే వేసి, నన్ను నీకు ఇష్టమైనట్లు తయారుచేసుకోవయ్యా అని వేడుకుంటే, వేడుకోగలిగితే, అంతకన్నా మనం చేయవలసినది ఇంకేముంటుంది? చెప్పటం అంత తేలిక్కాదు చెయ్యటం. అనుకోవటం అంత సులభం కాదు ఆచరించటం. చెప్పింది చేయాలన్నా, అనుకున్నది ఆచరణలో పెట్టాలన్నా ఆయన కృప అవసరం. అదుంటేనే ఆ రెండూ సాధ్యం. ఆ రెండూ సాధ్యపడాలంటే గురుదేవుల రెండు పాదాలను పట్టుకుని ప్రాధేయపడటం ఒక్కటే మార్గం.

అందుకే పూర్వ జన్మల గురించి, పునర్జన్మల గురించి ఆలోచించటం మానేసి, లభించిన ఈ జన్మని ఎలా సార్థక పరుచుకోవాలో తెలుసుకుని , అలా నడుచుకుని , అమ్మ చూపిన తేలిక మార్గం **నామాగ్ని దగ్ధ కర్మాణి...** అని నమ్మి ఆ నామస్మరణతో జీవితం సఫలం చేసుకోవటమే వివేకమనిపించుకుంటుంది. ఓం నమో భగవతే కాళీప్రసాదాయ పాహిమాం.. పాహిమాం.. పాహిమాం .

# శ్రీ బాబూజీతో నా ప్రయాణం

(గత సంచిక తరువాయి)

- జి. విజయకృష్ణ (బుజ్జి)

ఇంప్లాంట్ ప్రక్రియ దాదాపు 30 నిమిషాలు పడుతుందని వైద్యులు కుటుంబానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబం ఈ 30 నిమిషాల కార్యక్రమానికి సిద్ధంగా ఉంది. అయితే, ఆపరేషన్ థియేటర్‌లో జరిగిన సంఘటనలు సర్జన్లకు కూడా బాధాకరమైనవిగా మారాయి. ఎందుకంటే ఈ ప్రక్రియలో గుండె ఆగిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వారు ప్రతిసారీ నన్ను వదిలి వెళ్ళి కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేసేలోపల నా గుండె మళ్ళీ పనిచేయడం ప్రారంభిస్తుంది. రెండు మూడు సార్లు ఇలా జరిగిన తరువాత, వారు ఏ విధంగానైనా ఈ ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు, దానిని పూర్తి చేశారు. గుండె స్వయంగా అవసరమైన ఒత్తిడిని అభివృద్ధి చేయలేనందున, వారు ఇంట్రా అయోర్టిక్ బెలూన్ పంప్‌ను వుపయోగించారు. ఇది అవయవాలను కొనసాగించడానికి అవసరమైన ఒత్తిడిని అందించడం ద్వారా గుండె పనితీరులో సహాయపడుతుంది. 30 నిమిషాలు కొనసాగే ఈ మొత్తం ప్రక్రియ దాదాపు రెండున్నర గంటలు కొనసాగింది. అయితే శస్త్రచికిత్స ఫలితాన్ని తెలుసుకోవడానికి బయట వేచి ఉన్న వ్యక్తుల నాడి వేగంగా కొట్టుకుంది.

నేను ఇంకా అక్కడే ఉన్నానని ప్రకటించడానికి వచ్చిన వైద్యుడు, కార్డియాక్ సర్జన్‌గా వారి అభిప్రాయం ప్రకారం అంతా బాగానే వుందని, కానీ న్యూరాలజిస్ట్ మెదడుకు జరిగిన నష్టాన్ని స్పష్టంగా అంచనా వేయవలసి ఉంటుంది, ఎందుకంటే అనేక కార్డియాక్ అరెస్టులను నేను ఎదుర్కొన్నందున మెదడు కణాలు చెక్కుచెదరకుండా ఉండే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి అని తెలిపారు.

తన వంతుగా న్యూరాలజిస్ట్ మెదడు మరియు EEG యొక్క CT స్కాన్‌ను ఆదేశించాడు. అవన్నీ సానుకూల సంకేతాలను చూపించాయి. వయస్సు సంబంధిత నష్టం తప్ప, కానీ మెదడు పపిల్లరీ లైట్ రిఫ్లెక్స్‌కు దాదాపు బలహీనంగా స్పందించింది. వారు నా కోలుకునే అవకాశాలను చాలా తక్కువగా ఉంచారు.

- సశేషం

# సవ్య - అపసవ్య -మార్గములు

-సన్నిధానం కాళీమాత

ప్రతి పనికీ కూడా 2 మార్గాలు వుంటాయి. ఒకటి సవ్యమైనది. ఒకటి అపసవ్యమైనది. మొదటి మార్గము కష్టము. శ్రమలతో కూడి వుండవచ్చు. ధర్మ బద్ధమైనదిగా వుండి, స్థిరమైన ఫలితాలను ఇస్తుంది. 2వ మార్గము చాలా సులభంగా వున్నట్లుగా వుండి, భవిష్యత్తు అంధకారముగా వుంటుంది. ఎటువంటి ఫలితాలు కావాలో వివేక వంతులు తెలుసుకుని సవ్యమైన మార్గాన్ని ఎంచుకుంటారు.

స్వర్గాన్ని పొందటానికి కూడా రెండు మార్గాలు వున్నాయి. భూలోకంలో మనుష్యులు స్వర్గప్రాప్తికై పుణ్యం చేసి, తపస్సులు చేసి, యజ్ఞాలు చేసి, కష్టపడి యోగ సాధనలు చేసి స్వర్గానికి వెడతారు. రాక్షసులు అలా కాక, నేరుగా వెళ్ళి స్వర్గాన్ని ఆక్రమిస్తారు.

కృతయుగంలో వృత్రాసురుడు అనే రాక్షసుడు వుండేవాడు. వాడు కాలకేయులనే ఇద్దరు రాక్షసులతో కలిసి, తన పరాక్రమంతో ఇంద్రుణ్ణి జయించి, స్వర్గాన్ని ఆక్రమించాడు. దేవతలందరినీ అనేక బాధలకు గురి చేసేవాడు. వాడి బాధలు పడలేక దేవతలు బ్రహ్మదేవుడిని ఆశ్రయించారు. వృత్రాసురుడిని చంపే శక్తి ఇంద్రునికి లేకపోవటం వలన, మంచి ఉపాయం ఏదైనా చెప్పమని బ్రహ్మను ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మ 'ఆ వృత్రాసురుడు ఎవరి వల్లా చావడు. వాడిని చంపడానికి దధీచి మహర్షి యొక్క ఎముకలు పనికి వస్తాయి. ఆయన ఎన్నో యుగాలుగా తపస్సు చేస్తూ వుండటం వలన ఆయన తేజస్సు, బలము అంతా ఆయన ఎముకలలో వుంది. ఆయన ఎముకలు తీసుకుని, ఆయుధంగా చేసుకుని వాడితే, ఆ ఆయుధంతో వాడు చస్తాడు' అని చెప్పాడు. అప్పుడు ఇంద్రుడు దధీచి మహర్షి వద్దకు వెళ్ళి ప్రార్థించగా, ఆయన అంగీకరించి, 'నేను దేహం వదలి వెళ్ళిపోతాను. నా ఎముకలు మీరు ఉపయోగించుకోండి' అని తన దేహాన్ని త్యాగం చేశాడు.

ఇంద్రుడు దధీచి మహర్షి వెన్నెముకతో వజ్రాయుధం తయారు చేసుకుని, వృత్రాసురుణ్ణి సంహరించాడు. కాని కాలకేయులు, వృత్రాసురునితో వుండే ఇతర రాక్షసులు తప్పించుకు పారిపోయి సముద్రం లోపల దాక్కున్నారు. వీరంతా పగలు సముద్రంలో దాక్కుని

వుండి, రాత్రులు బయటకు వచ్చి మహర్షుల ఆశ్రమాలపై పడి దాడి చేసి, అనేకమందిని సంహరించేవారు.

వీరిని చంపడానికి ఇంద్రుడు అనేక రకాల ఉపాయాలు ఆలోచిస్తున్నాడు. ఇలా వుండగా వారి పాపము పరాకాష్ఠకు చేరి, వారు వశిష్ఠుని ఆశ్రమానికి వచ్చి, అక్కడ తపస్సు చేసుకునే 197 మంది ఆయన శిష్యులను సంహరించారు. అలాగే చ్యవన మహర్షి ఆశ్రమంలోని 100 మంది తాపసులను, భరద్వాజ మహర్షి ఆశ్రమంలో మరో 20 మందిని తాపసులను సంహరించారు.

సాధారణంగా మహర్షులు క్రోధం చెందరు. కాని అంతమంది సంహరింపబడటం చేత, తగిన చర్య తీసుకోదలచారు. అప్పుడు మహర్షులందరూ, ఇంద్రుడు, బ్రహ్మలతో కలసి విష్ణువును ప్రార్థించారు. ఆయన 'అగస్త్య మహర్షిని ప్రార్థించండి, ఆయన సముద్ర జలాలను ఇంకింపజేసి, రాక్షసులను బయటపెట్టగల సమర్థుడు. అంతేకాక, సముద్రజలాలను ఇంకింపజేసినప్పుడు సముద్రంలో వున్న జీవకోటి చావకుండా రక్షించగల మహత్తు కలవాడు' అని చెప్పాడు.

వారు అప్పుడు అగస్త్యుని వద్దకు వెళ్ళి ప్రార్థించగా ఆయన వాళ్ళకు సహాయం చేసే ఉద్దేశ్యంతో సముద్రజలం అంతటిని, మూడు నీటి చుక్కలుగా చేసుకొని, ఆపోశన చేశాడు. ఆయన చేతిలోకి సముద్ర జలమంతా మూడు నీటి చుక్కలుగా వచ్చింది. కాలకేయులు, ఇతర రాక్షసులు బయటపడ్డారు. ఇంద్రుడు వాళ్ళను సంహరించాడు. సముద్రంలోని జీవకోటి అంతా అలాగే సురక్షితంగా వుంది. ఆయన మళ్ళీ జలాలను సముద్రంలోకి విడిచి పెట్టాడు. అయితే తాను తీసుకుని, తిరిగి వదిలి పెట్టడం వలన సముద్రజలములు కొంత అపవిత్రం చెందాయని, అందుకని నిరంతరం సముద్రస్నానాలు చేయకండి. పర్వదినాలలో, పుణ్య తిథులలో మాత్రమే సముద్ర స్నానం చేయాలని ఆ మహర్షి నిర్ణయం చేశారు. మహాభారతంలోని అరణ్యపర్వంలోని గాథ ఇది. శ్రీబాబూజీ మహరాజ్ వారు సాధకులను సిద్ధులలోపడి అపసవ్య మార్గములలో వెళ్ళక, లక్ష్య సాధనము నందే దృష్టి వుంచమని హెచ్చరిక చేస్తూ వుండేవారు.

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

<u>రామ దూత హనుమంత</u> – అలా ఎగురుకొనుచు వెళ్తున్న హనుమంతునికి ఆకలి వేసింది. వెనువెంటనే చెంతనున్న ఖర్జూర వృక్షమును తన బలమునుపయోగించి తాకుటచే అది శబ్దముజేయుచు నేలకొరిగింది. ఆ శబ్దమును వినిన అసుర కాపలాదారులిద్దరు అచ్చోటకు వచ్చి హనుమంతునిజూచి అతనిపైకి దుమికారు. హనుమంతుడు తన చేతితో బలంగా ఒక గుద్దు గుద్దేసరికి ఒక అసురుడు నేలకొరిగాడు. రెండవవాడు పరుగెత్తుకుని వెళ్ళి వందల సంఖ్యలో అసురులను తీసుకుని వచ్చాడు. వారు వచ్చేలోపు హనుమంతుడు ఆ వృక్షమునెత్తి ఆ అసురమూకపై విసరివేయగ, ఒకరిద్దరు మినహా మిగిలిన వారందరూ క్రిందపడిపోయారు. రాక్షసస్త్రీలు రోదిస్తూ వారి వారి భర్తల శవములను ఈడ్చుకుని వెళ్ళిపోయారు. ఒక వానరుని ఈ చేష్ట రావణుని చెవి సోకింది. కోపాగ్నితో రగిలిపోయి తన మంత్రి కుమారుడైన జంబుమాలి అనబడు వీరుని సైన్యముతో పంపి, "ఆ వానరుడ్ని ఓడించి, సంహరించి రమ్ము!" అని పని అప్పగించాడు. హనుమంతుడు కొద్ది క్షణములలోనే ఆ సైన్యమునంతటినీ పడగొట్టాడు. జంబుమాలి మరణవార్త వినిన రావణుని మనసు, మొట్టమొదటసారి భయమునకు లోనైంది. వెంటనే తన కనిష్ఠ పుత్రుడైన అక్షకుమారుని పోరుకు పంపగ, ఆతడు కడు ఉత్సాహముతో హనుమంతునితో యుద్ధము చేసిననూ, చివరకు హనుమ చేతిలో ఆతడు సంహరింపబడ్డాడు. దుఃఖము ఒప్పొంగ రావణుడు తన జ్యేష్ఠపుత్రుడైన ఇంద్రజిత్తు అనబడు మేఘనాథుని పిలిచి, "నీవు ఎలాగైనా ఆ వానరుని సంహరించియో, లేక ప్రాణములతో బంధించివేసియో విజయముతో తిరిగిరావలయును. ఇంద్రుడిని జయించిన నీకు ఇది ఏమాత్రం కష్టతరమైన కార్యము కాదు" అన్నాడు.

ఇంద్రజిత్తు కడు భీకరముగ హనుమతో పోరాడిననూ, హనుమంతుడు అలసిపోలేదు. నిరుత్సాహపడనూ లేదు. అసుర సైన్యమునంతటినీ నాశనమొందించాడు. రావణ కుమారుని రథమును చిన్నాభిన్నము గావించాడు. రథమును కోల్పోయిన ఇంద్రజిత్తు ఆకాశమున ఎగురుచూ 'ఈతనిని జయించుట దుర్లభము' అని మనసులో తీర్మానించుకున్నాడు. పిదప బ్రహ్మాస్త్రమును హనుమపైకి విసిరాడు. ఆ అస్త్రమునకు కట్టుబడిన హనుమ నేలపై పడిపోయాడు. (బ్రహ్మదేవుని వేడుకోలును మన్నించి ఒక ముహూర్తకాలం ఆ అస్త్రమునకు కట్టుబడియుండెదనని గతమున హనుమంతుడు బ్రహ్మకు మాట ఇచ్చాడు) క్రింద పడిపోయిన హనుమంతుని అసుర సైన్యమంతా కలసి ఒక త్రాటితో కట్టివేసి ఈడ్చుకొని నగరములోనికి తీసుకునివెళ్ళారు. ఈలోగా ముహూర్తకాలం చెల్లిపోయింది. హనుమంతుని కట్లు విడిపోయాయి. అయిననూ ఆతడు రావణుని చూడవలెనన్న కోరికచేత, కట్టివేయబడిన స్థితిలోనే ఉండిపోయాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**స్వాశ్రమంచ, స్వజాతించ స్వకీర్తిం పుష్టి వర్ధనమ్**
**ఏతత్సర్వం పరిత్యజ్య గురుమేవ సమాశ్రయేత్** 41

**పదవిభాగము** :- స్వాశ్రమం-చ-స్వజాతిం-చ-స్వకీర్తిం-పుష్టివర్ధనమ్-ఏతత్-సర్వం-పరిత్యజ్య-గురుం-ఏవ-సమాశ్రయేత్.

**టీక** :- స్వ ఆశ్రమంచ= తన ఆశ్రమమును; స్వజాతించ= తనజాతిని; స్వకీర్తిం=తన పేరుప్రతిష్టలకు; పుష్టివర్ధనం=తన పోషణకు ఆధారమైన ధన ధాన్యాది సంపదలను; ఏతత్ సర్వం= తన సర్వస్వమును; పరిత్యజ్య=పరిత్యజించి; గురుమేవ= గురుదేవుని మాత్రమే; సమాశ్రయేత్= చక్కగా ఆశ్రయింపవలెను; శరణు పొందవలెను.

**వ్యాఖ్య** :- "బ్రహ్మమయుడు కావలెననుకొను దేహి తన ఆశ్రమాన్ని, జాతిని, కీర్తి ప్రతిష్ఠలను, ధన ధాన్యములను సంపూర్ణముగా త్యజించి గురుదేవునే చక్కగా ఆశ్రయింపవలెను" అని గురు భక్తునికి విధి నిర్ణయం చేస్తున్నాడు ఈశ్వరుడు. ఇది భగవద్గీతలోని "సర్వధర్మాన్ పరిత్యజ్య" అను చరమ శ్లోకము వంటిది. సమస్త ధర్మాచరణానికి ప్రతిఫలము గురు కృపా ప్రాప్తి గనుక, గురుదేవుడే "నాకు శరణాగతుడవు కమ్ము, నీకు భయమేల, నిన్ను రక్షిస్తాను" అంటున్నప్పుడు, భయపడవలసిన, లేక సందేహించవలసిన అవసరమేమున్నది? జగద్గురువైన శ్రీ కృష్ణపరమాత్మ సేవలో గోపికలు, మునిపత్నులు, గృహస్థాశ్రమ ధర్మాలను త్యజించారు. శ్రీ రామానందులు వర్ణభేదాన్ని నిషేధించి కబీరును తన శిష్యునిగా చేసుకోవటం ప్రఖ్యాతమే గదా? తన ముసల్మాన్ జాతినే వదిలి శ్రీచైతన్య గురుదేవుల నాశ్రయించి హరిదాసనే పేర ప్రసిద్ధుడైన శిష్యుని విషయం తెలిసినదే కదా? ఇక కుల విషయంలో పట్టింపులు వదలి కాంచీపూర్ణులను గురువులుగా స్వీకరించిన శ్రీరామానుజ చరిత్రము జగత్ప్రసిద్ధమే గదా! ఇక కీర్తి ప్రతిష్ఠలను, ఆస్తిపాస్థులను గురుదేవునికై త్యజించిన శిష్యవరేణ్యులు లెక్కకు మిక్కుటము గదా! సర్వ ధర్మములను వదిలి, గురుదేవుని (భగవంతుని) ఎందుకు శరణు చెందవలెనో భాగవతము స్పష్టముగా తెలియజేయుచున్నది.

*తన కుల ధర్మమున్ విడిచి దానవ వైరి పదారవిందముల్*
*పనివడి సేవచేసి పరిపాకమునొందక ఎవ్వడేని జ*
*చ్చిన మరుమేననైన నది సిద్ధి వహించు; దదీయ సేవ బా*
*సినకుల ధర్మ గౌరవము సిద్ధివహించునె యెన్నిమేనులన్?*

(భాగవతము1-5-100)

- సశేషం

# సృష్టిక్రమం

– పాలూరి ముకుంద్

మనం పురాణాలలో ఎంత లోతుగా వెళ్ళినా "మూలం భగవంతుడు" అనే దగ్గర ఆగిపోతాము. సాధారణంగా మనకు వచ్చే సందేహం 'అసలు సృష్టి ఎలా మొదలైంది? దేవతలు ఎందుకున్నారు? మనుషులు ఎందుకున్నారు? దేవతలకి, భగవంతునికి తేడా ఏమిటి?' ఈ ప్రశ్నలన్నిటికి సమాధానం ఋగ్వేదంలోని ఐత్రేయ బ్రాహ్మణంలోని ఐత్రేయ ఉపనిషత్తులో ఉంది. ఈ ఉపనిషత్తు ప్రకారం అన్నిటికంటే ముందు పరమాత్మే ఉన్నారు. పరమాత్మ అప్పుడు ఒక సామ్రాజ్యాన్ని సృష్టించుకోవాలి అనుకున్నారు. ముందు కాలాన్ని సృష్టించారు. తర్వాత దేవతలను సృష్టించారు. మెల్లమెల్లగా లోకాలను సృష్టించారు. దేవతలు భగవంతుడిని వారి ఆకలిని తీర్చుకోవడానికి ఒక శరీరాన్ని అడిగారు. భగవంతుడు వారికి గోవుని తయారు చేస్తే సరిపోదన్నారు. గుర్రాన్ని తయారుచేసినా సరిపోదన్నారు. అప్పుడు మనిషిని సృష్టిస్తే సరిపోతుందని అన్నారు. అగ్నిదేవుడు ముఖాన్ని (నోటి లోపల) ప్రవేశించి వాక్కుగా మారాడు. వాయుదేవుడు నాసికను ప్రవేశించి ప్రాణంగా మారాడు. మృత్యువు బొడ్డుని ప్రవేశించి అపానంగా మారాడు. సూర్యుడు చక్షువులను (కళ్ళను) ప్రవేశించి చూపును ప్రసాదించాడు. దశ దిశలన్నీ చెవులను ప్రవేశించి వినికిడిని ప్రసాదించాయి. భూమాత మూలికలు చర్మాన్ని ప్రవేశించితే జుట్టు వచ్చింది. చంద్రుడు హృదయాన్ని ప్రవేశించి మనస్సుగా మారాడు. ఇలా దేవతలందరూ వారి వారి స్థానాలలోకి ప్రవేశించారు. **(అయినా మనం పురుషసూక్తంలో చంద్రమా మనసో జాతః, చక్షోః సూర్యో అజాయతా, ముఖాద్ ఇన్ద్రశ్చ అగ్నిశ్చ, ప్రాణాత్ వాయుర్ అజాయతా** అని చదువుకుంటున్నాం కదా? ఇది మనకు తెలిసిన విషయమే. అర్థం చేసుకోము అంతే!)

వాళ్ళు అసలు ఈ శరీరాన్ని అడిగినది ఆకలి తీర్చుకోవడానికి కదా? మరి ఆకలి తీరాలంటే పదార్థం ఉండాలి కదా! అందుకని భగవంతుడు పదార్థాన్ని సృష్టించారు. ఆ పదార్థానికి దాని కర్తవ్యం తెలిసినప్పుడు "ఏమిటి!! పాలరాళ్ళ వంటి ఆ 32 పళ్ల కింద పడి నన్ను నలిగిపోమంటారా?!" అని చావు భయంతో పారిపోసాగింది. అప్పుడు భగవంతుడు పదార్థానికి నచ్చజెప్పాడు. "నీకు నా వలే అమరత్వం ఇస్తున్నాను. నిన్ను మనిషి ఎంత సేవించినా నువ్వు ఏదో ఒక రూపంలో వుంటావు. నిన్ను మనిషి జ్ఞాన రూపంలోనూ, భోజన రూపంలోనూ, జల రూపంలోనూ సర్వకాలం సేవిస్తూ ఉంటాడు. కానీ నువ్వు ఎప్పటికీ మృతి చెందవు. ఇప్పుడు వెళ్ళి నీ కర్తవ్యాన్ని మొదలుపెట్టు!" అని భగవంతుడు పదార్థాన్ని ఒప్పించి, తినడానికి విధానం కూడా కనిపెట్టారు.

ఇప్పుడు భగవంతుడు అనుకున్నాడు, "దేవతలందరూ దేహంలో ఉన్నారు సరే. కానీ నేను లేకపోతే ఏం లాభం?" ఇదీ నిజమే. విమానంలో అన్ని భాగాలు సరిగ్గా ఉన్నా, ఇంధనం (ఫ్యూయల్) లేకుండా అది ఎగరగలదా? అందుకని భగవంతుడు శరీరాన్ని ప్రవేశించాలని నిశ్చయించాడు. కానీ ఎలా? ఏ ఇంద్రియం ద్వారా ప్రవేశిద్దామని చూసినా అక్కడ ఒక దేవత అడ్డంగా కూర్చుని ఉన్నాడు. చివరికి స్వామి పుర్రెకి ముందు, వెనుక కాకుండా మధ్యలో కన్నం పెట్టి లోపలికి దూరారు. అందుకే శిశువులకు తల మీద మెత్తగా ఉంటుంది. శాస్త్రవేత్తలు ఆ బ్రహ్మరంధ్రానికి 'విధృతి' అని పేరు పెట్టారు. శ్రీకృష్ణుని బాల్యంలో గరుత్మంతుడు ఆయన దర్శనం కోరి రోజూ వైకుంఠం నుండి ప్రొద్దున బయలుదేరితే భూలోకం చేరేసరికి సాయంత్రం అయ్యేది. పక్షులు వచ్చే సమయం గనుక యశోదాదేవి కృష్ణుడిని ఇంట్లోకి తీసుకెళ్ళిపోయేది. ఈ ఉపనిషత్తును 'మహాధీశ ఐత్రేయ' మహర్షి రాశారు. చిన్నప్పుడు ఆయనకు వారి తండ్రి (విశాల బ్రాహ్మణుడు) ఒడిలో కూర్చునే అర్హత తండ్రి ఇవ్వకపోయేసరికి తల్లి (ఇతర) భూదేవిని ప్రార్థిస్తే భూదేవి మహాధీశునికి గొప్ప ఆధ్యాత్మిక స్థానం ఇచ్చారు. అప్పుడు ఆ జ్ఞానంతో మహాధీశుడు ఈ ఉపనిషత్తును వ్రాశాడు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు "ప్రతి ప్రశ్నకు సమాధానము ఉండి తీరుతుంది" అన్నట్టు, వేమన "ప్రశ్నలేని లోకమే ప్రశ్నార్థకమ్మురా!" అన్నట్టు మనం ఈ ఉపనిషత్తు ద్వారా ఈ రోజు సృష్టిక్రమం యొక్క రహస్యం తెలుసుకున్నాం. మనం ఎప్పటికీ జ్ఞానాన్ని సేవిస్తూ మనలో ఉన్న చైతన్యాన్ని గుర్తిస్తూ సర్వదా గురుపాదం పట్టుకుని ఉండాలి.

## *పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు*

* ***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును*** *

**మార్చి 2026**

3 మంగళ: ఫాల్గుణ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

13 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

19 గురు: శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది – శ్రీ సద్గురు పాదపూజ.

**ఏప్రియల్ 2026**

2 గురు– చైత్రపూర్ణిమ – శ్రీసద్గురుపాదపూజ

12 ఆది – శ్రీగురుదశమి – శ్రీసద్గురు పాదపూజ

(గత సంచిక తరువాయి)

# గురుకృప

కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

శ్రీగురుదేవులకు మూర్తిగారు స్వర్గస్థులైన విషయం తెలిసిన వెంటనే నరసమ్మగారి అన్నగారితో (రాయప్రోలు గోపాలం గారు), “అమ్మాయిని చదువుకు పంపండి, పై విషయాలు అన్నీ నేను చూసుకుంటాను” అని తమనే అనన్య శరణ్యంగా నమ్ముకున్న నరసమ్మగారికి అభయం ఇచ్చారు. టీచర్ చదువుకై ఆవిడ నరసాపురంలో జేరారు, మొదటి రోజే అక్కడి వార్డెన్ ఆవిడకి కళాయిలో పెరుగుతోడు పెట్టమని చెప్పి పని అప్పగించింది. నరసమ్మగారు తెలియక పక్కనే ఉన్న ఇత్తడి గంగాళంలో పెరుగు తోడు పెట్టారు. అక్కడ ఉన్నవారు పెరుగు పాడైపోతుంది అని ఆవిడపై ఆ సంస్థ కరెస్పాండెంట్‌కి పిర్యాదుచేశారు, నరసమ్మగారిని పిలిచి అడుగగా, “నాకు తెలియదండి, నేను కొత్తగా చేరాను” అని భయపడుతూ చెబుతుంటే దానికి ఆ కరెస్పాండంట్, “ఎందుకమ్మా అంత కంగారు పడతావ్?! ఇత్తడి గంగాళంలో తోడు పెట్టినా పెరుగు పాడు అవ్వకుండా, పులవకుండా ఉంది, నేను రుచి చూశాను, చాలా బాగుంది, అసలు నువ్వు ఏం చేశావు అని తెలుసుకోవడానికి పిలిచాను” అంటే ఆవిడ, “మా గురువుగారినే స్మరిస్తూ ఇంతమంది తినే పెరుగు పాడైపోతే, ఎలా బాబు అని బాధపడుతున్నానండి అంతే కానీ నాకు ఏమీ తెలియదు” అని అన్నారు. నరసమ్మగారు తనను ఇంత గండం నుంచి గట్టెక్కించినది ఆపన్నులను ఆదుకునే శరణాగత రక్షకుడు తన గురుదేవుడే అని శ్రీబాబుకు మనసులోనే నమస్కరించుకున్నారు.

నరసాపురంలో టీచర్ చదువు సరిగ్గా ఉండదని, ఇలాగే పనులు చెబుతూ వుంటారని కొవ్వూరులో బాగుంటుంది అని నరసమ్మగారికి ఎవరో చెప్పాగా అది తన గురుదేవులు ఈ రకంగా మార్గం చూపించారు అనుకుని ఆవిడ కొవ్వూరులో జేరారు. అక్కడ జేరిన కొన్ని రోజుల తర్వాత ఇనిస్టిట్యూట్ కరెస్పాండంటుతో మాట్లాడుతున్న సమయంలో కాకినాడలో మూర్తిగారితో పనిచేసిన సహోద్యోగి ఒకరు తన అక్కగారైన కరెస్పాండెంట్‌ని కలవడానికి వచ్చి నరసమ్మగారిని చూసి పలకరించి ఆ ఇనిస్టిట్యూట్ కరెస్పాండెంట్ తన అక్కగారే అని, “అక్కా! ఈవిడ భర్త, నేను కాకినాడలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో పని చేసేవాళ్ళం, ఆయన లేని మూలంగా ఈవిడ చదువు కోసం వచ్చారు. కాబట్టి ఈవిడకి ఎటువంటి డ్యూటీలు వేయకుండా, కాస్త చదువు విషయంలో నీ సహకారం అందించు” అని అన్నారు. తనని నమ్ముకున్న వారిని ఆదుకొనే ఆపద్బాంధవుడు శ్రీబాబే ఈ రకంగా అనుగ్రహించారు అని మనసులోనే నమస్కరించుకున్నారు.

1966లో నరసమ్మగారు రాజమండ్రిలో టీచర్ ట్రైనింగ్ అవుతుంటే అరికాలులో తుప్ప తీగ గుచ్చుకుంది. దాని నిమిత్తం వెంటేనే వైద్యం చేయించుకో అని హాస్టల్ నుంచి పంపించేశారు. అదే సమయంలో శ్రీబాబు రాజమండ్రిలో వంకాయల వారి వీధిలో జయంతులు జరుగుతుంటే అక్కడ ఉన్నారని తెలిసి వెళ్ళి శ్రీబాబుకు ఈ విషయం చెప్పగా, "ఏం భయంలేదు ఈ నాలుగు రోజులు ఇక్కడే ఉండి తీర్థప్రసాదాలు తీసుకో" అని అభయమిచ్చారు. ఆవిడ అలాగే శ్రీబాబు నామస్మరణ చేసుకుంటూ అక్కడే తీర్థప్రసాదాలు తీసుకుంటూ ఉన్నారు. నాలుగు రోజులు గడిచిన తర్వాత గుచ్చుకున్న చోట గాయం కానీ, మచ్చ కానీ లేకుండా పూర్తి స్వస్థత శ్రీబాబు ప్రసాదించారు.

1967లో నరసమ్మగారికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. మందులు వాడినా కూడా తగ్గక వ్యాధి తిరగబెట్టింది. ఆవిడ బాధ అనుభవించలేక మనసులోనే శ్రీబాబును తలుచుకుంటూ, "ఈ జ్వరం తగ్గదా బాబు! ఇంకా ఎందుకు ఉంచారు? నన్ను తీసుకుపోండి" అని ఏడ్చి పడుకుంటే కలలో ఒకడు నల్లబట్ట కట్టుకొని, "నిన్ను తీసుకు పోతా" అని వస్తుంటే, కాళీమాత కత్తితో వచ్చి, "నిన్ను చంపేస్తా, ఆ అమ్మాయికి ఏమీ కానివ్వను" అంటూ తరిమికొట్టింది. ఆ మర్నాడు రాత్రి శ్రీబాబు శ్రీమతి సీతమ్మగారితో, "నా రేడియో పాడైయింది, ఎదురింటి తాతయ్యగారి ఇంట్లో ఉన్న రేడియో మెకానిక్‌ని బాగుచేస్తారేమో అడుగు" అని సీతమ్మగారిని నరసమ్మగారి ఇంటికి పంపారు. సీతమ్మ గారు వెళ్ళి "శ్రీబాబు ఇప్పుడే వచ్చారు, నన్ను రేడియో కోసం పంపారు. ఇది నీ అదృష్టమే. నీ జ్వరం సంగతి బాబుకు చెప్పు" అని చెబితే, తనకు స్వప్నదర్శనం ఇచ్చిన కాళీమాతే సీతమ్మగారి రూపంలో వచ్చారు అనుకొని శ్రీబాబు దర్శనార్థం నరసమ్మగారు వెళ్ళారు.

"బాబు! నాకు జ్వరం...." అని ఆవిడ చెప్పబోతూ ఉంటే శ్రీబాబు, "మూడు నెలలుగా వస్తోంది కదా?! తలపోటు, కీళ్లనొప్పులు ఈ సమయం నుంచి ఈ సమయం వరకు ఉంటోంది" అని చెప్పి శ్రీ రామంగారిని (భీమవరం తాతయ్యగారి మనువడు) పిలిచి మందు పేరు చెప్పి 40 పొట్లాలుగా కట్టించి ఆవిడకి ఇవ్వమని, దానిని తేనెతో తీసుకోమని ఆవిడకి చెప్పారు. అలాగే పొలంగట్టు మీద గుంటకల్వరాకు ఉంటుంది. అది మిరియాలు వేసి మాత్రగా చేసి ఆవు మజ్జిగతో వేసుకోమని "రాయప్రోలు తాతయ్య ఇంట్లో ఆవు ఉంది కదా, బాబుగారు పోయమన్నారు అని అంటే ఇస్తారు, ఆ మజ్జిగతో ఈ మందు తీసుకో, తగ్గిపోతుంది" అని చెప్పారు. ఆవిధంగా మూడు నెలలుగా పడుతున్న బాధను, ఆవేదనను మూడు నిమిషాలలో రహితం చేశారు.

- సశేషం

# శ్రీ బాబూజీతో నా అనుభవాలు

(గత సంచిక తరువాయి) - ఇందుకూరి శర్మిష్ఠ

మావారికి తేడా చేస్తే హైదరాబాదులో యశోదా హాస్పిటల్ లో చూపించాము, పార్కిన్సన్స్ అని చెప్పి మందులు యిచ్చారు. కొన్నాళ్ళ తరువాత గుంటూరులోనే చూపిస్తున్నాము. చేతులు వణకటం, మాట కూడా తేడాగా వచ్చేది. కాలక్రమేణా పెరుగుతోంది గాని తగ్గటం లేదు. డాక్టర్లకు చూపిస్తే డోసు పెంచుతున్నారు కాని తగ్గటం లేదు. గుంటూరు డాక్టరు గారు బ్రెయిన్ ఆపరేషను చెయ్యాలి అన్నారు. బ్రెయిన్ ఆపరేషను అంటే భయపడి మాతాజీకి చెప్పాము. బెంగుళూరులో నిమ్హాన్స్ హాస్పిటల్‌లో చూపించమన్నారు మాతాజీ. తమ్ముడు, చిన్నబ్బాయి రామప్రసాదు, కోడలు కలిసి బెంగుళూరు తీసుకువెళ్ళారు. హాస్పిటలులో చూసిన తరువాత ఒక వారం రోజులు హాస్పిటలులో ఉంటే పరిశీలించి చెపుతాము అన్నారు. అలాగే జాయిను చేశాము. హాస్పిటలులో చాలా బాగా చూశారు. వారం తరువాత ఆపరేషను అవసరం లేదని చెప్పి మందులు పొటెన్సీ తగ్గించి రోజుకు నాలుగు సార్లు వేసుకోమన్నారు. ఈ వైద్యం బాగా పనిచేసింది. రెండు సంవత్సరాల తరువాత మరలా ఒకసారి చూపించాము.

2021వ సంవత్సరం దసరా పూజలలో మాతాజీ తీర్థం ఇస్తున్నారని రోజూ ఇద్దరం కలిసి వచ్చే వాళ్ళం. మూలా నక్షత్రం రోజున ఒక్కరే ముందుగా వచ్చేశారు. రోజూ వచ్చే దారిలో కాకుండా అన్నదానం బిల్డింగు వైపు నుంచి తిరిగి వస్తూ కారు షెడ్డు దగ్గర తూలి పడిపోయారు. మా మనవలు వెంటనే హాస్పిటలుకు తీసుకువెళ్ళారు. గడ్డం క్రింద రెండు కుట్లు పడ్డాయి. దెబ్బలకు మందులు యిచ్చి పంపారు. తర్వాత రోజులలో యిద్దరూ కలిసి తీర్థం తీసుకున్నాము. ఇంకా నలతగానే ఉన్నారు. ఆహారం సరిగా తీసుకునేవారు కాదు, బాగా నీరసపడిపోయారు.

త్రయోదశి రోజు ఉదయం హార్లిక్సు త్రాగి మందులన్నీ మామూలుగానే వేసుకున్నారు. బాగా నీరసంగా ఉన్నారని మా చిన్నబ్బాయి కొబ్బరినీళ్ళు తెస్తానని మా అమ్మాయి యింటికి వెళ్ళాడు. నేను ఎలా ఉంది అని అడుగుదామని చెయ్యి పట్టుకునేసరికి చల్లగా అయిపోయింది, నాడి కూడా తెలియలేదు. వెంటనే మా అమ్మాయికి ఫోను చేసి నాన్నగారికి బాగోలేదు వెంటనే రండి అని చెప్పాను. మా అబ్బాయి, అమ్మాయి, తమ్ముడు వెంటనే వచ్చారు. వాళ్ళు వచ్చేసరికి తేరుకోలేదు. డాక్టరు గారు వచ్చి చూసి "బాబూజీ దగ్గరికి వెళ్ళిపోయారమ్మా" అన్నారు. జై గురుదేవ్.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రితాశ్రమవాసులు అయిన ఆలపాటి వెంకటేశ్వర్లుగారు 6-2-26 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 88 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన గూడూరు పూర్ణ నాగేశ్వర శర్మగారు 13-2-26 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన పెంటపాటి భాస్కర రావు (నాయుడు) గారు 14-2-26 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 80 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రితాశ్రమవాసులు అయిన మావులేటి వెంకట నరసమ్మగారు 18-2-2026 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 88 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ హెడ్మాస్టర్ (వేదాంతం శ్రీనివాస అయ్యంగార్) గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

మహాత్ముల దర్శనం ఎంతో పుణ్య ప్రదమైనదని, వారి కరకమల స్పర్శ తగిలితేనే సర్వ పాపాలూ నశించిపోతాయని, వారితో సంభాషణ వలన కోటి తీర్థయాత్రలు చేసిన ఫలితం కలుగుతుందని, వారికి నమస్కరించుకోవటం వలన తరించే మార్గం దొరుకుతుందని అనుభజ్ఞులైన పెద్దలు చెబుతారు.



ఒక్కసారి దర్శిస్తేనే, ఒక్కసారి వారి స్పర్శ తగిలితేనే, ఒక్కసారి వారితో మాట్లాడితేనే, ఒక్కసారి నమస్కరిస్తేనే అంత గొప్ప ఫలితాలు కలిగితే, మరి ఎందరో మానవులు మహాత్ములను మాటిమాటికీ దర్శిస్తూ, నమస్కరిస్తూ, మాట్లాడుతూనే ఉంటారు గదా! వాళ్ళందరు అంతటి ఫలితాలను పొంద గలుగుతున్నారా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

ఉత్తమ క్షేత్రంలో (సారవంతమైన భూమిలో) మంచి విత్తనం వేస్తే, మంచి పంట పండుతుంది. సామాన్య క్షేత్రాలలో ఎంత మంచి విత్తనమైనా ఎంతో కష్టపడితేగాని తగిన దిగుబడి రాదు. చవిటి నేల అయితే మొలిచే ప్రశ్నే లేదు. ఇక, ఉత్తమ క్షేత్రమే ఉన్నా, మేలురకపు విత్తనాలే చల్లినా, వ్యవసాయం చేసే రైతును బట్టి, సామర్థ్యాన్ని బట్టి, పంట దిగుబడి ఉంటుంది.

అలాగే మానవులలో ఉత్తములు, మధ్యములు, అధములు, అధమాధములు ఉంటారు. మానవ హృదయ క్షేత్రాలలో ఆధ్యాత్మిక వ్యవసాయం జరిపి, ముక్తి పంటను పండించే ఉత్తమ రైతులే మహాత్ములు. ఉత్తమ మానవుని హృదయం ఉత్తమ క్షేత్రము. అతడు మహాత్ములను ఒక్కసారి దర్శించినా , ఒక్కసారి వారి పాదస్పర్శ తగిలినా, ఒక్క మాట వారితో మాట్లాడినా, ఒక్కసారి త్రికరణ శుద్ధిగా నమస్కరించినా చాలు. అతడు తరించే మార్గంలో అతి వేగంగా ముందుకు సాగిపోగలడు.

మధ్యముడు మహాత్ముల దర్శన, శ్రవణ, వందనములతో బాటు శ్రద్ధా భక్తులతో మరింతగా సాధన చేస్తేనే సత్ఫలితాలను పొంద గలుగుతాడు. అధముడు మహాత్ముల దర్శన శ్రవణ వందనాదులెన్ని సార్లు చేసినా ఫలితము శూన్యము. అధమాధములే అయితే , మహాత్ముల దర్శన వందనాదుల మాట అటుంచి, వారిని నిందిస్తారు, విమర్శిస్తారు, ద్వేషిస్తారు. ఇక వారెన్ని జన్మలెత్తినా మళ్ళీ ఆ మహాత్ముని అనుగ్రహం పొందితేగాని బాగుపడరు.

శ్రీ వేదాంతం శ్రీనివాస అయ్యంగారు ఉత్తముల కోవకు చెందినవారు. శ్రీ బాబు బాల బాలికలను అఖండ విద్యావంతులుగాను సద్గుణ సౌశీల్య సంపద గలవారిగాను, ఆదర్శ భారతీయులుగానే గాక, భగవంతుని యందు భక్తి విశ్వాసములు గలవారినిగా తీర్చి దిద్దాలనే మహదాశయంతో, ఆశ్రమంలో 1981వ సంవత్సరంలో శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద గురుకులమును స్థాపించి, యితర ప్రాంతాల నుండి వచ్చే బాల బాలికల కోసం ప్రత్యేక వసతి సౌకర్యం కూడ కల్పించారు.

శ్రీ బాబు భక్తులైన శ్రీ వి.వి. కృష్ణారావుగారు (దత్తు మేష్టారు) కొంత కాలం గురుకుల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, వృద్ధాప్యం వలన విరమించుకున్నారు. 1985లో ఆ పదవికి శ్రీ శ్రీనివాస అయ్యంగార్‌ని నియమించటం జరిగింది. ఆ పదవీ బాధ్యతలు స్వీకరించటానికి వారు ఆశ్రమానికి వచ్చి, ముందుగా శ్రీ బాబు దర్శనం చేసుకోవలెనని కోరారు.

ఉదయం 10 గంటల సమయము. ఆశ్రమములోని శ్రీ బాబు విజ్ఞాన మందిరపు హాలులో శ్రీ బాబు సింహాసనాసీనులై ఉన్నారు. శ్రీనివాస అయ్యంగారు శ్రీ బాబు వద్దకు వెళ్ళి రెండు ఆపిల్ పండ్లు వారికి సమర్పించి, సాష్టాంగ వందనం చేసుకున్నారు. శ్రీ బాబు ఆశీర్వచన పూర్వకంగా వారి శిరస్సు నిమురుతూ “జన్మ సాఫల్య సిద్ధిరస్తు” అని వారికి ఒక ఆపిల్ పండును ప్రసాదంగా యిచ్చి, “ఇది సత్ఫలం. ఇదే మీకు నా ప్రసాదము” అన్నారు.

- సశేషం

విష్ణు  కథలు


-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# భక్త పోతన

**నర్తకుని భంగిఁ బెక్కగు**
**మూర్తులతో నెవ్వడాడు మునులున్ దివిజుల్**
**కీర్తింప నేర రెవ్వని**
**వర్తన మొరు లెఱుగ రట్టివాని నుతింతున్**

"ఏ ప్రభువు నటునివలె అనేక ఆకృతులతో నటించునో, ఋషులు, దేవతలు ఎవనిని కీర్తింపజాలరో యెవ్వని వర్తనమును ఎవ్వరూ ఎఱుగ జాలరో – అట్టి ప్రభువుని నేను స్తుతించెదను"



**పోతన వ్యక్తిత్వం**

పోతన కుటుంబ పోషణమునకు కుమారునితో కలసి వ్యవసాయం చేసి గడిపేవాడు. శ్రీనాధుడు అతని బావమరది. భాగవత కృతిని ఆ దేశపు రాజునకు అంకితము చేయమని నిర్బందిస్తూ ఉండేవాడు. పోతనను హేళన చేస్తూ "హాలికులకు కుశలమా?" అని హేళనగా ప్రశ్నిస్తే –

**బాలరసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకం**
**గూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించుట కంటె సత్కవుల్**
**హాలికులైననేమి గహనాంతర సీమల గందమూల గౌ**
**ద్ధాళికులైన నేమి నిజ దారసుతోదర పోషణార్థమై.**

ఈ పద్యంలో కృతి దానం ఇవ్వటంలో కలిగిన వైముఖ్యము, స్వయంకృషి చేసి సంసారం పోషించుకోవటంలోఉండే తృప్తి వెల్లడి అవుతుంది.

**ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములు కొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే**
**సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ**
**బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.**

"భోగపరాయణులైన రాజులకు కృతిగా ఇచ్చి వారిచ్చే అగ్రహారాదులు గ్రహించుట కంటె శ్రీహరికి అంకితం చేస్తున్నాను" అనే భావంతో వ్రాసిన పద్యం ఇది.

భాగవతం ఎవ్వరికైనా కృతి ఇవ్వటానికి సిద్ధపడతాడేమో అని ఆ శంకతో సరస్వతి కన్నీరు కార్చుచు అతనికి ప్రత్యక్షమైనప్పుడు ఈ క్రింది పద్యాన్ని చెప్పాడు.

**కాటుక కంటనీరు చనుకట్టు పయింబడనేల యేడ్చెదో**
**కైటభ దైత్య మర్దనుని గాదిల కోడల! యోమదంబ! యో**
**హాటక గర్భురాణి! నిను నాకటికిం గొని పోయి యల్లక**
**ర్ణాట కిరాత కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!**

"కృతిని ఇవ్వటం అంటే సరస్వతిని అమ్ముటయే అని, అది ఆమెకు అప్రియము కనుక తానట్లు ఎన్నటికి చేయననే" భావము వెలిబుచ్చాడు.

పోతన గుణములలోనికెల్ల ముఖ్యమైనది భగవద్భక్తి. హరిసేవ చేయని అవయములు, అవయములే కావు అని, చక్రి చింత లేని జన్మము జన్మమే కాదనే అభిప్రాయము వెలిబుచ్చాడు. పోతనకు శివకేశవ భేదము లేదు.

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**గలుగ నేటికి దల్లుల కడుపు చేటు.**

మరియు విష్ణు చరణ కమల సేవ, విష్ణు భక్తుల తొలి స్నేహము, అపార భూత దయ తనకు అలవడ వలెనని అతని కోరిక. ఈ భావాన్నే దశమ స్కంధంలో సుదాముడు అనే మాలాకారునితో చెప్పిస్తాడు.

**నీపాద కమల సేవయు, నీపాదార్చకులతోడ నెయ్యమును నితాం**
**తాపార భూత దయయును దాపసమందార నాకు దయసేయగదే.**

కృష్ణుడు సుదాముని అనుగ్రహించాడు. పోతనను కూడా అనుగ్రహించాడు. భాగవతం అష్టమ స్కంధంలో గజేంద్రుని రక్షించటానికి వెళ్ళిన తీరును పోతన ఇలా వర్ణించాడు.

**సిరికిం జెప్పడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింపడే**
**పరివారంబును జీరడ భ్రగపతిం బన్నింపడా కర్ణికాం**
**తరధమ్మిల్లము జక్క నొత్తడు వివాదప్రోద్ధిత శ్రీ కుచో**
**పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై**

శ్రీనాధుడు బావగారైన పోతనతో "బావా! గజేంద్రుడి ప్రాణాలను రక్షించాలని ఉత్సాహం ఉరకలు వేస్తూ ఉంటే ఏ ఆయుధం తీసుకోకుండా ఎలా వెళ్ళాడయ్యా శ్రీహరి?" అని హేళనగా అన్నాడు. - సశేషం

---

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

2025 డిసెంబరు 26 నుండి 28 వరకు గుడివాడ పట్టణంలో జరిగిన సత్సంగ దృశ్యములు










2026 జనవరి 10 వ తేదీన విజయవాడలో జరిగిన ధర్మాచార్య సభలో శ్రీ మాతాజీ వారు పాల్గొన్న దృశ్యములు


REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## 2026 జనవరి 3 నుండి 5 వరకు బెంగుళూరులో జరిగిన శ్రీ మాతాజీవారి సత్సంగ దృశ్యములు






శ్రీ స్వస్వరూపానంద
స్వామీజీ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.